ప్రజాశక్తి

మంగళవారం 20 డిసెంబర్ 2022

8 పేజీలు





విశాఖపట్నం   అనకాపల్లి

స్ఫూర్తినిచ్చిన సిఐటియు మహాసభ

- మోడీ ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ ఏప్రిల్ 5న చలో ఢిల్లీ
- ముగింపు ఉపన్యాసంలో బేబిరాణి
- సర్కారు కళ్లు తెరిచేలా పోరాటాలు నిర్వహించాలి : లోకనాథం



మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర కార్యదర్శి బేబిరాణి

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి, పరవాడ విలేకరి

అనకాపల్లి జిల్లా సిఐటియు 12వ మహాసభలు దిగ్విజయంగా ముగిశాయి. ఆది, సోమవారాల్లో పరవాడలోని కోటి వీరయ్య నగర్ (సీతారామ కల్యాణ మండపం)లో జరిగిన ఈ మహాసభ ప్రతినిధులకు స్ఫూర్తినిచ్చింది. రాబోయే కాలంలో చేపట్టబోయే పోరాటాలకు మహాసభ దిశానిర్దేశం చేసింది. గత పోరాటానుభవాలను పంచుకున్నారు. కర్తవ్యాలు రూపొందించుకున్నారు. మహాసభలో సిఐటియు విశాఖ జిల్లా అధ్యక్షులు కెఎం శ్రీనివాసరావు, ఎపి రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శులు ఎం.అప్పలరాజు, డి.వెంకన్న సౌహార్ధసందేశాలిచ్చారు. మహాసభ 64 మందితో నూతన కమిటీని ఎన్నుకుంది.



మాట్లాడుతున్న లోకనాథం

మహాసభ ముగింపు సందర్భంగా సిఐటియు రాష్ట్ర కార్యదర్శి బేబిరాణి మాట్లాడుతూ వచ్చే ఏడాది ఏప్రిల్ 5న మోడీ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా ఢిల్లీలో భారీ ప్రదర్శన, సభ జరుగుతుందన్నారు. కార్మిక, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల చలో ఢిల్లీ పిలుపులో ప్రజలను భాగస్వాములు చేయాలన్నారు. కార్మిక, ప్రజావ్యతిరేక విధానాలను వెనక్కు తీసుకొనే వరకూ కార్మికులు ఐక్యపోరాటాలు నిర్వహించాలన్నారు. ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.లోకనాథం మాట్లాడుతూ కార్మిక సమస్యలపై ప్రభుత్వాలు కళ్లుతెరిచేలా పోరాటాలుండాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దాడులు పెరుగుతున్న నేపథ్యంలో వాటిని ప్రతిఘటించేందుకు కార్మికులు సమరశీలంగా పోరాటాలు చేపట్టాలన్నారు. వైద్యసేవా కార్యక్రమాలు నిర్వహించి ప్రజలకు కార్మికులు అండగా నిలబడాలన్నారు.

పలు తీర్మానాలు ఆమోదం

జిల్లా ప్రజలు, మిగతా 2లో..

పనుల్లో పురోగతి సాధించాలి

సమీక్షా సమావేశంలో జిల్లా కలెక్టర్ మల్లికార్జున



ప్రజాశక్తి-విశాఖపట్నం: నాడు-నేడు, గడప గడపకు మన ప్రభుత్వం, హౌసింగ్ పనుల్లో పురోగతి సాధించాలని విశాఖ జిల్లా కలెక్టర్ ఎ.మల్లికార్జున ఆదేశించారు. పనుల పురోగతిపై సోమవారం అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. నాడు- నేడు పనుల పురోగతిపై సమీక్షిస్తూ పాఠశాలలు, జూనియర్ కాలేజీలు, అంగన్‌వాడీ భవనాలు, పట్టణ ఆరోగ్య కేంద్రాలు నిర్మాణ దశలను అడిగి తెలుసుకున్నారు. పట్టణ ఆరోగ్య కేంద్రాలు 42కు గాను 36 పూర్తి అయినట్లు వెల్లడించారు. మిగిలినవి వాటిని త్వరలోనే పూర్తి చేయాలని అధికారులు ఆదేశించారు.

ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సుస్థిర అభివృద్ధి లక్ష్యాల (ఎస్డీజీ) సూచికలైన విద్య, తల్లి బిడ్డల సంక్షేమం, ఐదేళ్లలోపు తక్కువ బరువు గల పిల్లల మిగతా 2లో..

భూముల రీ సర్వేపై అవగాహన

కలెక్టర్ రవి పట్టన్ శెట్టి



ప్రజాశక్తి- అనకాపల్లి ప్రతినిధి

జగనన్న శాశ్వత భూ హక్కు- భూ రక్షణకు జరుగుతున్న భూముల రీసర్వేపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని కలెక్టర్ రవి పట్టన్ శెట్టి అధికారులను ఆదేశించారు. జిల్లాలోని మండలాల ప్రత్యేకాధికారులు, తహశీల్దార్లు, ఎంపీడీవోలతో సోమవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడుతూ, రీసర్వే వల్ల కలిగే లాభాలను రైతులకు తెలియజేయాలన్నారు. అనుమానాలను నివృత్తి చేయాలని కోరారు. సర్వే పూర్తయితే భావితరాలకు ఏ విధమైన భూ సమస్యలు రావన్నారు. విస్తీర్ణం, భూమి సంక్రమించిన విధానం, సర్వే నెంబరు ఖాతా నంబర్లతో పాటు సరిహద్దులు భూమి మ్యాపు కూడా ఉంటుందని తెలిపారు. ఈ సమావేశంలో జెసి కల్పనాకుమారి, డిఆర్‌ఒ పి.వెంకటరమణ, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

కార్పొరేట్‌కు ధీటుగా ప్రభుత్వాసుపత్రులు

▶ వార్త మెయిన్‌లో..

నయా సరళీకరణ విధానాలను వ్యతిరేకించాలి

▶ వార్త 8లో..

పోర్టుల ప్రయివేటీకరణ తగదంటూ ధర్నా

▶ వార్త మెయిన్‌లో..

గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ లోగో ఆవిష్కరణ

ప్రజాశక్తి-గ్రేటర్ విశాఖ బ్యూరో : విశాఖలో 2023 మార్చి 3, 4 తేదీల్లో నిర్వహించనున్న గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌కు సంబంధించిన లోగోను రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ సోమవారం ఆవిష్కరించారు. స్థానిక సర్క్యూట్ హౌస్‌లో ఏపీఐఐసీ, డిఐసి అధికారులతో సమావేశమైన మంత్రి అమర్‌నాథ్ సమ్మిట్‌కు సంబంధించి పలు అంశాలపై చర్చించారు. సమ్మిట్‌కి సంబంధించిన వెబ్‌సైట్ కూడా ఒకటి, రెండు రోజుల్లో అందుబాటులోకి తేనున్నామని మంత్రి అమర్నాథ్ తెలియజేశారు. ఇప్పటికే పలు దేశాలను చెందిన పారిశ్రామిక ప్రముఖులు ఈ సమ్మిట్‌లో పాల్గొనేందుకు సుముఖత వ్యక్తం చేశారని వివరించారు. ప్రపంచ దేశాల నుంచి పెట్టుబడులను రాబట్టి, రాష్ట్రాన్ని పారిశ్రామికంగా అగ్రస్థానంలో నిలపడమే కాకుండా, అనేకమంది నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలన్నది ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆకాంక్ష అని మంత్రి అమర్‌నాథ్ చెప్పారు. ఈ సమావేశంలో జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ సిహెచ్.గణపతి, అసిస్టెంట్ డైరెక్టర్ ఎంవి.కరుణాకర్, ఎపిఐఐసి జెడ్ఎం సిహెచ్.రంగయ్య తదితరులు పాల్గొన్నారు.



గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ లోగోను ఆవిష్కరిస్తున్న మంత్రి అమర్‌నాథ్

గ్యాస్ యూనిట్‌ను తొలగించాలి

సిపిఎం కార్పొరేటర్ గంగారావు డిమాండ్

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : ఫిషింగ్ హార్బర్ ప్రాంతం 37వ వార్డు పరిధి కొత్త అగ్రహారంలో జనవాసాల మధ్య ఉన్న నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ట్రైనింగ్ యూనిట్ విషవాయులను విడుదల చేస్తూ, ఆ ప్రాంతంప్రజల ఆరోగ్యాలకు తీవ్రహాని కలిగిస్తుందని, దానిని తక్షణం అక్కడి నుంచి తొలగించాలని సిపిఎం కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు డిమాండ్ చేశారు. గ్యాస్ యూనిట్ తరలించాలని డిమాండ్ చేస్తూ సోమవారం కలెక్టరేట్ ఎదుట మత్స్యకారులు మత్య కార్మిక సంఘం (సిఐటియు) ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విష వాయువుల లీక్ వల్ల ఎంతోమంది అనారోగ్యం పాలయ్యారని తెలిపారు. వాంతులు, చర్మవ్యాధులకు గురైనా స్థానిక కార్పొరేటర్, మంత్రులు సంఘటనా స్థలాన్ని పరిశీలించలేదన్నారు. బాధితులను పరామర్శించకపోవటం శోచనీయం అని పేర్కొన్నారు. బాధితులకు కనీస వైద్యం అందివ్వవలేదని తెలిపారు. అధికారులు, ప్రభుత్వ యంత్రాంగం సంఘటన స్థలానికి చేరుకొని, పరిశీలించి విష వాయువులను విడుదల చేసిన సంస్థను తొలగించాలని డిమాండ్ చేశారు. విష వాయువుల లీకేజీకి కారకులైన వారిపై చర్యలు తీసుకొని, బాధితులకు నష్టపరిహారం, వైద్య సదుపాయం అందించాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ మల్లికార్జునను కలిసి వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జగదాంబ జోన్ అధ్యక్షుడు ఎం.సుబ్బారావు, ఎపి మత్స్యకారులు-మత్స్య కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు కర్రి చంద్రశేఖర్, నాయకులు ఆర్.తాతారావు, చింతపల్లి అమ్మోరు, రాగతి అర్మిల, బాధితులు పాల్గొన్నారు.



సిపిఎం ఆధ్వర్యాన కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న మత్స్యకారులు

మొదటి పేజీ తరువాయి..

స్ఫూర్తినిచ్చిన సిఐటియు మహాసభ



తీర్మానం ప్రవేశపెడుతున్న రాము

సంఘటిత, అసంఘటితరంగ కార్మికులు ఎదుర్కొంటున్న అనేక అంశాలపై మహాసభ తీర్మానాలను ఆమోదించింది. ఫార్మా, ఎస్ఇజెడ్‌లో ప్రమాదాలు అరికట్టాలని తీర్మానించింది. స్కీం వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ పథకాలను పునరుద్ధరించాలని, రవాణా కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, కనీస వేతనాల సలహా మండలిని రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటుచేయాలని, వంద పడకల ఇఎస్ఐ ఆసుపత్రి నిర్మించాలని, లేబర్ కోడ్స్‌ను ఉపసంహరించుకోవాలని, ఉపాధి హామీ చట్టాన్ని బలోపేతం చేయాలని, పర్యావరణాన్ని కాపాడాలని, ఎస్ఇజెడ్‌లో కార్మిక చట్టాలు అమలుచేయాలని, విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ప్రయివేటీకరణ నిర్ణయాన్ని వెనక్కితీసుకోవాలని, పరిశ్రమల్లో స్థానికులకు 75 శాతం ఉద్యోగాలు ఇవ్వాలని, సహకార చక్కెర ఫ్యాక్టరీలను ఆధునికీకరించాలని, గ్రామ పంచాయతీ కార్మికులు, గ్రీన్ అంబాసిడర్లకు ప్రతినెలా జీతాలు చెల్లించాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని మహాసభ తీర్మానించింది.

ఈ సభలో సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్.శంకరరావు, జి.కోటేశ్వరరావు, కార్యదర్శులు ఆర్.రాము, గనిసెట్టి సత్యనారాయణ, సత్తిబాబు సహా ఎం.నాగేషు, వరలక్ష్మి, చంద్రశేఖర్, కుమారి, వివి.శ్రీనివాసరావు, పరమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పనుల్లో పురోగతి సాధించాలి

సంక్షేమం, గర్భస్థ మహిళల రక్తహీనత వివరాలు నమోదు, డ్రాపౌట్ విద్యార్థులు తదితర అంశాలపై మున్సిపల్ జోనల్ కమిషనర్లు, ఎంపిడిఒలు క్షేత్ర స్థాయిలో పరిశీలన చేసి సమీక్షలు నిర్వహించాలని ఆదేశించారు.

గడప గడపకు మన ప్రభుత్వం పనులకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. హౌసింగ్ పనులకు సంబంధించి పట్టణ పరిధిలో ఇంకను ప్రారంభం కాకుండా ఉన్న ఇళ్ల గురించి అధికారులు అడిగి తెలుసుకున్నారు. 100 శాతం మంజూరు కాబడిన ఇళ్లను గ్రౌండింగ్ చేయాలని ఆదేశించారు.



క్రిస్మస్ వేడుకల్లో ఎపిఐఐసి డైరెక్టర్ మెల్లి అప్పారావు

ఘనంగా క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ : జీసస్ ప్రేయర్ ఫెలోషిప్ అండ్ లోకల్ క్రిస్టియన్ ఫ్రెండ్స్ ఆధ్వర్యాన కెఆర్ఎం.కాలనీలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎపిఐఐసి డైరెక్టర్ మెల్లి అప్పారావు హాజరయ్యారు. ముందుగా కేక్ కట్ చేసి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, యేసు క్రీస్తు ఆశీస్సులు అందరిపట్ల ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పి.ఎ.స్వామి, జీసస్ ప్రేయర్ ఫెలోషిప్ చర్చ్ నిర్వాహకులు శ్యామల విజయ కుమార్, పాస్టర్లు కాలేబు, ఎం.చంద్రపాల్, జార్జిముల్లోర్, వైసిపి నాయకులు కందిమళ్ల రాజశేఖర్, చర్చి సభ్యులు పాల్గొన్నారు.

కెకె-2 లైన్ తనిఖీ

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : కెకె -2 లైన్, ఎన్ఎండిసి కిరండూల్‌ను ఈస్ట్ కోస్ట్ రైల్వే జనరల్ మేనేజర్ ఆర్ఎస్ సుంకర్ సోమవారం తనిఖీ చేశారు. సైడింగ్‌లు, రైల్వే స్థానాలు, రైల్వే స్టేషన్లు, ఎన్ఎండిసి, మైనింగ్ సైట్ పరిశీలించారు. ట్రాక్, వంపులు, వంతెనలు, పాయింట్లు, క్రాసింగ్‌లను సెక్షన్‌లోని విండో ట్రైలింగ్ తనిఖీని నిర్వహించారు. కిరండూల్-జగ్దల్‌పూర్ డబ్లింగ్ పనులు, సైడింగ్ పనులను పరిశీలించి కొన్ని సవరణలు సూచించారు. కిరండూల్ వద్ద వేగవంతమైన వ్యాగన్ డిశ్చార్జ్ సైలో సిస్టమ్‌ను పరిశీలించారు. ఈ తనిఖీల్లో డివిజనల్ రైల్వే మేనేజర్ అనూప్ సత్పతి పాల్గొన్నారు.

ఐద్వా జాతీయ సభలను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : కేరళ రాష్ట్రం తిరువనంతపురంలో జనవరి 6 నుంచి 9వ తేదీ వరకు జరిగే ఐద్వా ఆలిండియా 13వ మహాసభలను జయప్రదంచేయాలని కోరుతూ ఐద్వా జగదాంబ జోన్ కమిటీ ఆధ్వర్యాన సోమవారం పందిమెట్ట ఏరియాలో ఐద్వా సీనియర్ నాయకులు ఆదిలక్ష్మి పతాకాన్ని ఎగురవేశారు. ఇదే సందర్భంగా ఐద్వా ఉద్యమ నిర్మాత సుశీలగోపాలన్ 22వ వర్థంతి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా అధ్యక్షులు బి.పద్మ మాట్లాడుతూ, సుశీలగోపాలన్ మహిళా ఉద్యమం వ్యవస్థాపకుల్లో ఒకరన్నారు. 1981లో ఐద్వా ఆలిండియా మొదటి ప్రధాన కార్యదర్శిగా, తుది శ్వాస విడిచే వరకు అఖిల భారత అధ్యక్షులుగా పనిచేశారని గుర్తుచేశారు. పేద కార్మికుల సమస్యలపై సంఘాలు పెట్టించి నిరంతరం పనిచేశారని, మూడుసార్లు ఎంపీగా గెలిచారన్నారు. మహిళా రక్షణ చట్టాల అమలు కోసం ప్రస్తుత పరిస్థితుల్లో బలమైన మహిళా ఉద్యమం అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జోన్ అధ్యక్ష, కార్యదర్శులు కె.మణి, ఆర్.వరలక్ష్మి, బి.సత్యవతి, సరస్వతి, లక్ష్మి పాల్గొన్నారు.



ఐద్వా జెండాను ఎగురవేస్తున్న సభ్యులు

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

ప్రజాశక్తి -కోటవురట్ల: మండల కేంద్రంలో రైతు భరోసా కేంద్రం వద్ద ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని స్థానిక ఎమ్మెల్యే గొల్ల బాబురావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాబురావు మాట్లాడుతూ, రైతుల వద్ద ఉన్న ప్రతి గింజ కొనుగోలు చేయాలని అధికారులను ఆదేశించారు. గత ఖరీఫ్ సీజన్లో కొనుగోలు చేసిన ధాన్యంకు సొమ్ము నేటికీ చెల్లించకపోవడం పట్ల పలువురు రైతులు తన దృష్టికి తీసుకు వస్తున్నారని బకాయిలు అందే విధంగా చర్యలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ అధికారిని అరుణ కుమారికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో చంద్రశేఖర్, తహశీల్దార్ జానకమ్మ, మండల ఉపాధ్యక్షులు దత్తుడు రాజు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, అధికారులు పాల్గొన్నారు,

రావికమతం:మండలంలోని చినపాచిల గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని రావికమతం మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కంచిపాటి జగ్గారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతులు పండించిన వరి ధాన్యాన్ని రైతు భరోసా కేంద్రాల ద్వారా ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని తెలిపారు. రైతులందరూ రైతు భరోసా కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఏ గ్రేడు క్వింటా ధాన్యానికి రూ.2060, సాదా ధాన్యం క్వింటాకు రూ.2040 చొప్పున ధర చెల్లిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ పర్సన్ ఇంచార్జ్ కొమార ప్రసాదు, సర్పంచ్లు దాసరి వరహాలు, రవికుమార్, బంటు సన్యాసినాయుడు, కలిగిరి ప్రసాద్, కోమిర ఎంపీటీసీ బంటు శ్రీనివాసరావు పిఎసిఎస్ కార్యదర్శి సత్యనారాయణ పాల్గొన్నారు.

జగన్మోహన్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలకు ప్రత్యేక కార్యక్రమాలు

వైసిపి జిల్లా అధ్యక్షులు పంచకర్ల రమేష్‌బాబు

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పుట్టినరోజు సందర్భంగా మూడు రోజుల పాటు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని వైసిపి విశాఖపట్నం జిల్లా అధ్యక్షులు పంచకర్ల రమేష్‌బాబు తెలిపారు. సోమవారం ఉదయం మద్దిలపాలెం, పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, జిల్లా వ్యాప్తంగా సేవ్ లైఫ్ అనే నినాదంతో భవిష్యత్తులో అత్యవసర పరిస్థితులలో రక్తదానం చెయ్యడానికి సుముఖంగా ఉన్నవారిచే ysrcpblooddonation.comలో రిజిస్ట్రేషన్ చేయించే కార్యక్రమం చేపట్టామని తెలిపారు. 19వ తేదీన జిల్లా వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో క్రీడల పోటీలు, 20న మొక్కలు నాటే కార్యక్రమం, స్వచ్ఛంద సంస్థలు, మేధావులు, కుల సంఘాల ప్రతినిధులతో జగనన్న పరిపాలన – రాష్ట్ర సంక్షేమం – అభివృద్ధిపై చర్చా వేదికలు, ముందస్తు జన్మదిన వేడుకలు నిర్వహిస్తామని, 21న అన్ని నియోజకవర్గాలల్లో కేక్ కటింగ్‌లు, రక్తదాన శిబిరాలు, సేవా కార్యక్రమాలు, మహిళలకు పలు రకాల పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రవి రెడ్డి, బెహరా భాస్కర రావు పాల్గొన్నారు.

స్టాండింగ్ కౌన్సిల్ అవినీతి నిర్ణయాలపై చర్యకు డిమాండ్

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : జివిఎంసి స్టాండింగ్ కౌన్సిల్ అవినీతి నిర్ణయాలపై తక్షణం తగు చర్యలు తీసుకోవాలని టిడిపి ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. సోమవారం ఈ మేరకు కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ, చెత్త సేకరణకు ఒక్కొక్క సచివాలయానికి ఒకటి చొప్పున క్లాప్ వాహనాన్ని కేటాయించారని చెప్పారు. అయినప్పటికీ 5, 6 జోన్ల పరిధిలో 3 నెలల కోసం అదనంగా వాహనాలకు టెండర్లు పిలుస్తూ, ఇందుకోసం రూ.75 లక్షలు కేటాయిస్తూ స్టాండింగ్ కౌన్సిల్ నిర్ణయించిందని చెప్పారు. స్టాండింగ్ కౌన్సిల్‌లో రూ.50 లక్షలకు మించి ఒక పనికి ఆమోదం ఇవ్వరాదని, ఇది చట్ట విరుద్ధం అని పేర్కొన్నారు. ప్రజలు పన్నుల రూపంలో చెల్లించే డబ్బులు ఈ విధంగా కౌన్సిల్లో అధికారంలో ఉన్న వైసీపీ పాలకవర్గం దుర్వినియోగం చేయడం దుర్మార్గం అన్నారు.

పోస్టుల భర్తీ ఫీజు తగ్గించాలి : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : కేంద్రీయ విద్యాలయాల్లో ఖాళీ పోస్టులకు ఇచ్చిన నోటిఫికేషన్‌లో పరీక్ష ఫీజును వెంటనే తగ్గించాలని డివైఎఫ్ఐ విశాఖ జిల్లా అధ్యక్షులు యుఎస్ఎన్.రాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేంద్రీయ విద్యాలయాల్లో ఉద్యోగాలకు ఒక పోస్టుకు రూ.2,300 పరీక్ష ఫీజు పెట్టడం దారుణమన్నారు. ఈ ఫీజు నిరుద్యోగులను లూటీ చేయటమేనని విమర్శించారు. 4, 5 రకాల పోస్టులకు అర్హుడైన అభ్యర్థి దరఖాస్తు చేయాలంటే రూ.15 వేలు వరకు చెల్లించాలని, ఇది పేదలకు మోయలేని భారం అన్నారు. వెంటనే ఈ ఫీజులు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ ఫీజులకు వ్యతిరేకంగా అభ్యర్థులు పోరాడాలని పిలుపునిచ్చారు.

ప్రభుత్వ తప్పులను ప్రశ్నిస్తే బెదిరిస్తారా...? : బి.వి రామ్

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : ప్రభుత్వం చేసే తప్పులను ప్రశ్నిస్తే బెదిరిస్తారా అని తెలుగు శక్తి అధ్యక్షుడు బివి రామ్ ప్రశ్నించారు. ఈ మేరకు సోమవారం స్పందనలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, తనకు మంత్రి గుడివాడ అనుచరుడి నుంచి ప్రాణభయం ఉందని గత నెలలోనే ఫిర్యాదు చేసినప్పటికీ పోలీసులు ఇప్పటివరకు చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. వైసిపి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రశ్నిస్తున్నందుకు కుమార్ అనే వ్యక్తి తనకు ఫోన్ చేసి బెదిరించారన్నారు. గుడివాడ అమర్‌నాథ్‌ను విమర్శించడం మానకపోతే పర్యవసానాలు తీవ్రంగా ఉంటాయని దుర్భాషలాడారని తెలిపారు.

పోక్సో కేసులో 20 ఏళ్ల శిక్ష

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ : విశాఖపట్నం హెచ్‌బి కాలనీలో 2వ తరగతి బాలికను పాఠశాల సమయం ముగిసిన తర్వాత చాక్లెట్ ఇస్తానని ప్రలోభపెట్టి 2020 డిసెంబర్ 15న అత్యాచారానికి పాల్పడిన సంఘటనలో సారిక వెంకటరమణ (66)కు 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష రూ.200 జరిమానా, రూ.4 లక్షల పరిహారం ఇవ్వాలని పోక్సో కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి కె.రామశ్రీనివాస్ సోమవారం తీర్పును వెలువరించారు. అప్పట్లో బాలిక తల్లి ఫిర్యాదు మేరకు దిశా ఎసిపి ప్రేమ్ కాజల్ ఆధ్వర్యంలో విచారణ నిర్వహించి సాక్ష్యాలను కోర్టులో సమర్పించారు. కోర్టులో విచారణ చేపట్టారు. నేరం రుజువు కావడంతో పై విధంగా తీర్పును వెలువడించారు.

పోలీస్ స్పందనకు 46 ఫిర్యాదులు

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : ప్రతి సోమవారం జరిగే స్పందన కార్యక్రమన్ని ఈ వారం ఎడిసిపి(అడ్మిన్) ఎంఆర్‌కె. రాజు పోలీస్ కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి 46 మంది ఫిర్యాదుదారులు వచ్చి తమ తమ సమస్యలను రిపోర్టులు ద్వారా అందజేశారు. ఎంఆర్‌కె.రాజు ఫిర్యాదులను పరిశీలించారు. కమిషనర్ సిహెచ్.శ్రీకాంత్ వీడియో కాన్ఫరెన్స్‌లో ఫిర్యాదుదారులతో మాట్లాడి, వారి సమస్యలను తెలుసుకొని, సంబంధిత పోలీసు అధికారులతో కూడా మాట్లాడి తగు చర్యలకు ఆదేశించారు.

సిఎం జగన్ జన్మదినం సందర్భంగా ఆటల పోటీలు



క్రికెట్ పోటీల ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న రాజు

ప్రజాశక్తి-సీతమ్మధార : యువత అన్ని రంగాల్లో రాణించాలని విశాఖ ఎంపీ ఎంవివి. సత్యనారాయణ అన్నారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలను పురస్కరించుకొని కైలాసపురం డిఎల్‌బి గ్రౌండ్‌లో ఈ నెల 19 నుంచి 21వరకు నిర్వహించనున్న జెఎంఆర్.కప్ క్రికెట్ పోటీలను విశాఖ జిల్లా వైసిపి అధ్యక్షులుపంచకర్ల రమేష్‌బాబు, ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కెకె.రాజుతో కలిసి సోమవారం ప్రారంభించారు. ముందుగా క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. 31జట్లు పాల్గొంటున్న టోర్నీని టాస్ వేసి మ్యాచ్ ప్రారంభించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కట్టుమూరి సతీష్, ఫ్లోర్‌లీడర్ బాణల శ్రీనివాసరావు, డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ అల్లు శంకరరావు, స్టాండింగ్ కమిటీ సభ్యులు, సారిపిల్లి గోవింద్, బర్కత్‌ఆలీ, కార్పొరేటర్లు కె.అనిల్‌కుమార్ రాజు, సాడి పద్మారెడ్డి, ఆళ్ల లీలావతి, ఉషశ్రీ, రెయ్యి వెంకటరమణ, కెవిఎన్ శశికళ, కోఆప్షన్ సభ్యులు సేనాపతి అప్పారావు, వార్డు ఇంచార్జ్ నీలి రవి, సీనియర్ నేతలు కిరణ్ రాజు, పేడాడ రమణకుమారి, బొడ్డేటి కాశీ విశ్వనాథం పాల్గొన్నారు.

సీతమ్మధార : ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి పుట్టినరోజు సందర్భంగా విశాఖ ఉత్తర నియోజకవర్గం పార్టీ కార్యాలయం ప్రాంగణంలో కెకె రాజు నేతత్వంలో సోమవారం వైసిపి మహిళా విభాగం ఆధ్వర్యంలో మహిళలకు ఖోఖో, త్రోబాల్, కబడ్డీ పోటీలను నిర్వహించారు. ఈ పోటీలను టాస్ వేసి ప్రారంభించిన రాజు మాట్లాడుతూ సిఎం జగన్ పిలుపు మేరకు ఆయన జన్మదినం సందర్భంగాసేవా కార్యక్రమాలతోపాటు ఆటల పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు సాడి పద్మారెడ్డి, ఉషశ్రీ, ఆళ్ళ లీలావతి, కెవిఎన్ శశికళ, యాత కార్పొరేషన్ చైర్మన్ పిల్లి సుజాత, రత్నం, పాల్గొన్నారు.

ములగాడ: సిఎం జగన్మోహనరెడ్డి పుట్టినరోజు సందర్భంగా పశ్చిమ నియోజకవర్గం సమన్వయకర్త ఆడారి ఆనంద్ కుమార్ ఆధ్వర్యంలో సింధియా షిప్‌యార్డ్ గ్రౌండ్‌లో నిర్వహిస్తున క్రికెట్ పోటీలను వైసిపి జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేష్‌బాబు ప్రారంభించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, జిల్లా ట్రేడ్ యూనియన్ అధ్యక్షులు కలిదిండి బద్రీనాథ్, జివిఎంసి కోఆప్షన్ సభ్యులు బెహరా భాస్కరరావు, స్టాండింగ్ కమిటీ సభ్యులు పివి. సురేష్, కార్పొరేటర్లు గుండపు నాగేశ్వరరావు, కొణతాల సుధా, బల్ల లక్ష్మణరావు, వార్డు ఇన్‌ఛార్జిలు పుర్రె సురేష్, రేవల్ల సత్యనారాయణ, గులిగిందల కృష్ణ, దొడ్డి కిరణ్, ముర్రు నానాజీ, చుక్కా ప్రసాద్‌రెడ్డి, అప్పలస్వామి నాయుడు, పిలకా రామ్మోహన్‌రె నమ్మి శ్రీను, సోమాదుల సురేష్ పాల్గొన్నారు.



ములగాడలో పోటీలను ప్రారంభిస్తున్న పంచకర్ల



భీమిలిలో ఆటగాళ్లను పరిచయం చేసుకుంటున్న ముత్తంశెట్టి

భీమునిపట్నం : స్థానిక జివిఎంసి మినీ క్రికెట్ స్టేడియంలో ఎపి సిఎం, కప్ క్రికెట్ పోటీలను సోమవారం వైసిపి నియోజక వర్గ పరిశీలకులు పి బాలరాజుతో కలిసి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ప్రారంభించారు. క్రీడాకారులను పరిచయం చేసుకున్నాక,. బ్యాటింగ్ చేసి క్రికెట్ పోటీలను ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో జివిఎంసి కోఆప్షన్ సభ్యులు కొప్పల ప్రభావతి, పిఎసిఎస్ అధ్యక్షులు అక్కరమాని రామునాయుడు పాల్గొన్నారు

మహిళలకు ముగ్గుల పోటీలు

ఆరిలోవ: ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పుట్టినరోజు సందర్భంగాకార్పొరేటర్ కెళ్ళ సునీత ఆధ్వర్యంలో ఆరిలోవకాలనీ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహం వద్ద మహిళలకు ముగ్గులు, మ్యూజికల్ చైర్, లెమన్ స్పూన్స్ ఆటల పోటీలు నిర్వహించారు. తూర్పు నియోజకవర్గ వైసిపి నేత అక్కరమాని వెంకటరావు వార్డు ఇన్‌ఛార్జి కెళ్ల సత్యనారాయణ, సిఐ సూరిబాబు, పిల్లి వీర్రాజు, బేతా దుర్గారావు, వెంకటరెడ్డి, శ్రీను పోలారావు, అప్పలనాయుడు, బాబురావు, బేగం పాల్గొన్నారు.



ఆరిలోవలో ముగ్గుల పోటీలు పర్యవేక్షిస్తున్న కార్పొరేటర్ సునీత

నేరాలు ఘోరాలు

180 కిలోల గంజాయి పట్టివేత

ప్రజాశక్తి-రోలుగుంట: మండలంలోని కె.నాయుడిపాలెం గ్రామ శివారులో బొలేరో వాహనంలో అక్రమంగా తరలిస్తున్న 180 కేజీల గంజాయిని పట్టుకున్నామని ఎస్సై నాగకార్తీక్ తెలిపారు. గంజాయిని తరలిస్తున్నట్లు ఇద్దరిని అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు. బైక్, బలొరో వాహనం సీజ్ చేసినట్లు తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

బాలవికాస్ శిక్షణ తరగతులు

ప్రజాశక్తి-ఉక్కునగరం: అగనంపూడి పునరావాస కాలనీ కొండయ్యవలస చిన్న ఆంజనేయస్వామి ఆలయంలో నిర్వహించే సత్యసాయి బాలవికాస్ శిక్షణ తరగతుల పోస్టర్‌ను బలిరెడ్డి సత్యనారాయణ ఆవిష్కరించారు. అనంతర అగనంపూడి సిడబ్ల్యుసి కార్యదర్శి కరణం పైడిరాజును సత్కరించారు. సత్యసాయి భజన మండలి అగనంపూడి జోనల్ కోఆర్డినేటర్ బివి సుబ్బారావు మాట్లాడుతూ ఈనెల 24న ఉక్కునగరం సత్యసాయి సేవాసమితి 22వ వార్షికోత్సవం నిర్వహిస్తున్నారు. అగనంపూడి బాలవికాస్ గురువు విందుల వెంకట పద్మలత, విందుల రామారావు, బండారు శ్రీనివాసరావు, వెలగా గిరిధర్ పాల్గొన్నారు.

ద్రోణంరాజు సత్యనారాయణకు ఘన నివాళి

ప్రజాశక్తి- పెందుర్తి: ద్రోణంరాజు సత్యనారాయణ జయంతిని పురస్కరించుకుని మండలంలోని చిన్న ముసిడివాడ గ్రామంలో నియోజకవర్గ కాంగ్రెస్ సీనియర్ నేత విన్నకోట రాము ఆధ్వర్యంలో తన నివాసంలో ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నేత ముక్కా రామునాయుడు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రంథాలయానికి కొత్త పుస్తకాలు



కొత్త పుస్తకాలు లిస్ట్‌ను ప్రదర్శిస్తున్న లైబ్రేరియన్ సూర్యకళ

ప్రజాశక్తి- పెందుర్తి : స్థానిక గ్రంథాలయానికి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ కొండా రమాదేవి ప్రోత్సాహంతో 779 కొత్త పుస్తకాలు వచ్చినట్లు గ్రంథాలయాధికారి బి సూర్యకళ తెలిపారు. చదువరుల సమక్షంలో కొత్త పుస్తకాలను ప్రదర్శన చేపట్టారు. కానిస్టేబుల్, ఎస్‌ఐ, ఇతర ఉద్యోగాలు, ఇతర పోటీ పరీక్షలకు సంబంధించిన సమాచారం ఉన్న కాంపిటేటివ్ పుస్తకాలు కూడా వచ్చాయని, నిరుద్యోగులు, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని లైబ్రేరియన్ సూర్యకళ సూచించారు. సాహిత్యవేత్తలకు కొత్త పుస్తకాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు.

టిడిపి బలోపేతానికి కృషి



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కోరాడ రాజబాబు

ప్రజాశక్తి -భీమునిపట్నం : టిడిపి బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పార్టీ నియోజకవర్గ ఇంఛార్జి కోరాడ రాజబాబు, పార్టీ శ్రేణులకు సూచించారు. సోమవారం నాలుగోవార్డు నేతలతో పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమీక్షలో మాట్లాడుతూ, వైసిపి ప్రభుత్వ వైఫల్యాలను క్షేత్రస్థాయిలో ఎండగట్టాలని పిలుపునిచ్చారు. ఏ రాజకీయ పార్టీకి లేనంతగా టిడిపికి బలమైన కేడర్ ఉందని, రానున్న సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రంలో తెలుగుదేశం అధికారంలోకి వస్తుందని ధీమావ్యక్తం చేశారు. సమావేశంలో పార్టీ వార్డు అధ్యక్షులు పాసి నరసింగరావు, తెలుగు రైతు నియోజకవర్గ అధ్యక్షులు బోర బంగారురెడ్డి, బిసి సెల్ కార్యదర్శి కారి అప్పారావు, తెలుగు మహిళ ఉపాధ్యక్షులు వి పోలమ్మ, మాజీ ఎంపిటిసి చీపుళ్ళ శ్రీనివాస్, వాసుపల్లి ఎల్లయ్య పాల్గొన్నారు.

డ్రైవర్లకు భద్రతా కిట్లు పంపిణీ

ప్రజాశక్తి- గాజువాక : డ్రైవర్ కుటుంబీకులకు ప్రమాద, ఆరోగ్య బీమా కల్పించాలని స్టీల్‌సిటీ లారీ అసోసియేషన్ ఉపాధ్యక్షులు నెల్లి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. సోమవారం టాటా మోటార్ ఆధ్వర్యంలో ఆకాంక్ష ప్రాజెక్టు కింద దిబ్బపాలెం గ్రామంలో డ్రైవర్లకు భద్రతా కిట్లను పంపిణీ చేశారు. నారాయణరావు, లక్ష్మణ పాల్గొన్నారు.



కిట్లు అందజేస్తున్న నెల్లి శ్రీనివాసరావు

విమ్స్‌లో వైద్య సేవలు మెరుగు పరచాలి

ప్రజాశక్తి- సిరిపురం : విమ్స్‌లో వైద్యసేవలను మెరుగుపరిస్తే కెజిహెచ్‌పై ఒత్తిడి తగ్గుతుందని జెడి ఫౌండేషన్ కన్వీనర్ ప్రియాంక దండి అన్నారు. సోమవారం విమ్స్ డైరెక్టర్ డాక్టర్ కె. రాంబాబును కలిసి, అత్యాధునిక సౌకర్యాలున్న విమ్స్ ఆసుపత్రిలో అవుట్ ఇన్ పేషెంట్లు తక్కువగా నమోదుకు కారణాలను అడిగి తెలుసుకున్నారు. దీనిపై డాక్టర్ రాంబాబు స్పందిస్తూ, ప్రభుత్వ అధీనంలోనే విమ్స్ నడుస్తూ, ఉచితంగానే వైద్యసేవలు అందిస్తున్నామని చాలామందికి తెలియదన్నారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన సేవలే అందిస్తున్నామన్నారు. ఆరోగ్యశ్రీలో 70శాతా ఆపరేషన్లు ఉచితంగానే చేస్తున్నామని, అయితే బోధనాసుపత్రి కాకపోవడంతో కొన్ని సేవలకు సాధారణ ఛార్జీలను తీసుకుంటున్నామన్నారు. విమ్స్‌ను టీచింగ్ ఆసుపత్రిని చేయాలన్న ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉందన్నారు. దీనిపై ప్రియాంక స్పందిస్తూ, విమ్స్‌ను టీచింగ్ హాస్పిటల్ చేయమని ప్రభుత్వాన్ని వెంటనే విజ్ఞప్తి చేస్తామన్నారు. అలాగే సూపర్ స్పెషలిటీ విభాగంలో ఖాళీగా ఉన్న 32 వైద్యనిపుణుల పోస్టులు భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని కోరతామన్నారు విమ్స్‌లో వైద్యసేవలకు సాయం చేసేందుకు తమ ఫౌండేషన్ ప్రతినిధి అందుబాటులో ఉంటారని, 63058 21260 నెంబర్‌కు సంప్రదించి సాయం తీసుకోవాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ కోఆర్డినేటర్ జగన్ మురారి ఉన్నారు.



విమ్స్ డైరెక్టర్ రాంబాబుతో మాట్లాడుతున్న ప్రియాంక

శానిటేషన్ ఉద్యోగికి బుల్లెట్ గాయాలు



గాయపడిన బాలప్రవీణ్‌కు ఆసుపత్రిలో వైద్యసేవలు

ప్రజాశక్తి -పిఎం పాలెం : పందిని కాల్చే బుల్లెట్ గోడకు తగిలి విచ్చిన్నమై, ఆ ముక్కలు తగలడంతో జివిఎంసి ఎనిమిదోవార్డు పరిధిలో శానిటేషన్ విభాగం అవుట్‌సోర్సింగ్ ఉద్యోగి గాయాలైన ఘటన సోమవారం చోటుచేసుకుంది. కాపులపాడు డంపింగ్ యార్డ్ వద్ద జరిగిన సంఘటన వివరాలివి.

సోమవారం జివిఎంసి కమిషనర్ పి.రాజబాబు కాపులుప్పాడ డంపింగ్ యార్డు పర్యటన అనంతరం కమిషనర్‌తో వచ్చిన సిబ్బంది అక్కడ సంచరిస్తున్న పందులను కాల్చే పనిని చేపట్టారు. ఈ క్రమంలో ఒక పందిని షూట్ చేయగా, దానికి తగిలిన బుల్లెట్ తర్వాత గోడను తాకి ముక్కలుకాగా, ఆ ముక్కలు అక్కడే తడిపొడి చెత్తను వేరుచేస్తున్న శానిటేషన్ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగి పెదవాల్తేరుకు చెందిన చెవ్వేటి బాలప్రవీణ్‌ను తాకాయి. ఈ ఘటనలో ప్రవీణ్ వీపునకు నాలుగుచోట్ల, చేతిపై రెండు చోట్ల బుల్లెట్ గాయాలయ్యాయి. గాయపడిన ప్రవీణ్‌ను వెంటనే గాయత్రి ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించారు. విషయం తెలుసుకున్న మధురవాడ జోన్ సిఐటియు నేత పి రాజ్‌కుమార్ ఆసుపత్రికి చేరుకుని పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ప్రవీణ్‌కు ప్రమాదమేమీ లేనప్పటికీ, శరరంలో చొచ్చుకుపోయిన బుల్లెట్ ముక్కలను వెంటనే తీయాలని, మెడికవర్ ఆసుపత్రికి తరలించాలని వైద్యులు సూచించగా, సిఐటియు నేతలు జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము, ఎంఎహెచ్‌ఒ కిశోర్‌ను సంప్రదించి క్షతగాత్రుడు బాలప్రవీణ్‌ను మెడికవర్ ఆసుపత్రికి తీసుకెళ్లారు.

కేంద్రీయ విద్యాలయంలో వైద్య శిబిరం



ప్రశంసాపత్రాలను అందిస్తున్న రాజకుమారి

ప్రజాశక్తి- విశాఖపట్నం : తాటిచెట్లపాలెంలోని కేంద్రీయ విద్యాలయ వాల్తేర్ పాఠశాలలో హెల్పింగ్ హార్ట్స్ వ్యవస్థాపక అధ్యక్షులు, విశాఖపట్నం బ్లడ్‌డోనర్స్ క్లబ్ ఫౌండర్ ఎస్.రాజకుమారి ఆధ్వర్యంలో సోమవారం రక్తహీనత, కంటి తనిఖీ శిబిరాన్ని నిర్వహించారు. డైటీషియన్ లీలాప్రియదర్శన్ పాల్గొని, ఆహారం తీసుకోవడంలో జాగ్రత్తలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కమల్ జీత్, కందాల ఛాయ, కోలా సురేష్‌కుమార్, డాక్టర్ ఇటి.నవీన్‌కుమార్, విజయభాస్కరరెడ్డి, హెన్రీ జేమ్స్, సురేష్ హుమ్జీ,భాస్కర్, స్కూల్ సిబ్బంది పాల్గొన్నారు.

కోర్టు ఉద్యోగాలకు 21 నుంచి రాత పరీక్షలు

ప్రజాశక్తి- లీగల్ రిపోర్టర్ : రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం, జిల్లా కోర్టులలో ఉద్యోగాల భర్తీకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈనెల 21 నుంచి రాత పరీక్షలు నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి సోమవారం ప్రకటనలో తెలిపారు. పరీక్షకు హాజరు కాబోయే అభ్యర్థులు ఆధార్‌కార్డు, పాన్‌కార్డ్, డ్రైవింగ్ లైసెన్స్, బ్యాంక్ పాస్‌బుక్స్ వంటి తమ స్వీయ అధికృత నకళ్లను పరిశీలన కోసం పరీక్ష కేంద్రాలకు తీసుకురావాలని సూచించారు. పరీక్ష హాల్‌లోకి ఎలక్ట్రానిక్ సంబంధిత పరికరాలు, చేతి వాచీలు, బ్యాగులు, మనీ పర్స్‌లు వంటి వస్తువులను అనుమతించబోరన్నారు. పరీక్ష ప్రారంభానికి పావుగంట ముందే గేట్లు మూసేస్తారని,అభ్యర్థులంతా నిర్ణీత సమయానికి 30 నిమిషాల ముందుగా పరీక్ష కేంద్రాలకు హాజరు కావాలని సూచించారు.

జనావాసాల మధ్య సెల్ టవర్ వద్దు



నిరసన ర్యాలీలో మాట్లాడుతున్న ఫాదర్ జ్ఞాన్‌ప్రకాశ్

ప్రజాశక్తి- విశాఖపట్నం : జ్ఞానాపురం డయాస్ వీధిలో 5జి సెల్‌టవర్ ఏర్పాటును నిరసిస్తూ జ్ఞానాపురం సెయింట్ పీటర్స్ చర్చి నుంచి ఫాదర్ జొన్నాడ జ్ఞాన్ ప్రకాశ్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీని చేపట్టారు. హై ఫ్రీక్వెన్సీ సెల్ టవర్‌ను జనావాసాల మధ్య ఏర్పాటు చేస్తే స్థానికులు తీవ్ర అనారోగ్యాలకు గురయ్యే ప్రమాదం ఉందని, జనవాసాలకు దూరంగా ఖాళీ ప్రదేశాలలో, ప్రభుత్వ స్థలాలలో ఎవరికి ఎటువంటి ఇబ్బందులు లేని చోట ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. పోలీసుల సహకారంతో సెల్‌టవర్ ఏర్పాటుకు ప్రయత్నిస్తే ఉద్యమిస్తామని హెచ్చరించారు. దీనిపై జిల్లా కలెక్టర్, జివిఎంసి కమిషనర్‌కు వినతిపత్రాలను అందిస్తామన్నారు. కార్యక్రమంలో గురుమండల సలహా సంఘం అధ్యక్షుడు అమర్, బూర రవీంద్ర, శేషుబాబు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపు

ప్రజాశక్తి -భీమునిపట్నం : జివిఎంసి నాలుగో వార్డు పాత పరదేశీపాలెంలో సోమవారం ప్రభుత్వ స్థలంలో నిర్మించిన 10 రేకుల షెడ్డులు, కొన్ని నిర్మాణాలను రెవెన్యూ అధికారులు, సిబ్బందితో కలిసి, యంత్రాల సాయంతో తొలగించారు.తహశీల్దార్ కోరాడ వేణుగోపాల్ ఆదేశాల మేరకు, ఆర్ఐ ఎస్ మధుల, విఆర్ఒ జి అప్పారావు ఆధ్వర్యంలో ఆక్రమణలు తొలగించారు. ప్రభుత్వ స్థలాలను ఆక్రమించిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ హెచ్చరించారు.

షిప్‌యార్డు సమస్యలపై వినతి



ఎంపీలకు వినతిపత్రం అందజేస్తున్న యూనియన్ నేతలు

ప్రజాశక్తి- ములగాడ :హిందూస్థాన్ షిప్‌యార్డ్ ఎల్అండ్ ఎం సీరిస్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని గుర్తింపు యూనియన్ నాయకులు కోరారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా సోమవారం ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలును ఢిల్లీలోని అతని కార్యాలయంలో ఎమ్మెల్సీ పివిఎస్.మాధవ్‌తో కలిసి వెళ్లి షిప్‌యార్డు సమస్యలపై విన్నవించారు. తర్వాత రక్షణశాఖ ప్రొడక్షన్ విభాగం అడిషనల్ సెక్రటరీ టి.నటరాజన్‌ను కలిసి, ఎల్అండ్ఎం సీరీస్‌ను రెగ్యులర్ విషయంపై మాట్లాడారు.గుర్తింపు యూనియన్ నాయకులు రమణమూర్తి, చంటిబాబు, రమేష్, రాజాన అప్పారావు ఉన్నారు.

రోడ్డుకిరువైపులా వ్యర్థాల డంపింగ్‌పై ఆగ్రహం

కాపులుప్పాడ యార్డును సందర్శించిన కమిషనర్ రాజాబాబు



డంపింగ్ యార్డును పరిశీలిస్తున్న జివిఎంసి కమిషనర్

ప్రజాశక్తి- మధురవాడ : కాపులుప్పాడ డంపింగ్ యార్డ్‌లోని వ్యర్థాలను ప్రధాన మార్గం ఇరువైపులా వేయడంపై జివిఎంసి కమిషనర్ పి.రాజాబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా సోమవారం కాపులుప్పాడ డంపింగ్ యార్డ్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వ్యర్థాలను విచ్చలవిడిగా ఎక్కడికక్కడే డంపింగ్ చేయరాదని ఆదేశించారు. వాహనాలలో వచ్చిన వ్యర్థాలను లోపలకు తీసుకెళ్లి క్రమ పద్ధతిలో డంపింగ్ చేయవలసిన బాధ్యత శానిటరీ ఇన్‌స్పెక్టర్‌దేనని, దీనికి సంబంధించిన రికార్డులను సక్రమంగా నిర్వహించక పోవడంతోపాటు, రోడ్డుకు ఇరువైపులా వ్యర్థాలను డంపింగ్ చేస్తుండడంపై శానిటరీ ఇన్‌స్పెక్టర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే చార్జ్‌మెమో ఇవ్వాలని అదనపు కమిషనర్ డాక్టర్ వి.సన్యాసిరావును ఆదేశించారు ప్రధాన గేట్లకిరువైపులా ఉన్న వ్యర్థాలను వారం రోజుల్లో లోపలికి తరలించాలని ఆదేశించారు. ప్రధాన మార్గంలో 360 డిగ్రీస్ కవర్‌చేసేలా సిసి కెమెరాలను ఏర్పాటు చేయాలన్నారు. వేయింగ్ మిషన్‌ను పరిశీలించి తడిపొడి వ్యర్థాలు ఎంతెంత పరిమాణంలో వస్తున్నాయని ఆరా తీశారు. తదుపరి జిగ్మా, జిందాల్‌ను సందర్శించారు. జిందాల్ కంపెనీకి 1200 టన్నులకు గాను 800 టన్నుల వ్యర్థాలను జివిఎంసి అందజేస్తోందని, మిగిలిన నాలుగు టన్నుల వ్యర్థాలను సప్లై చేయాలని కమిషనర్‌ను ఫ్యాక్టరీ యాజమాన్యం కోరింది. ప్రస్తుతం జిందాల్ కంపెనీ ద్వారా 10 మెగావాట్ల విద్యుదుత్పత్తి చేసి, ఎపిఎస్ఇబి గ్రిడ్‌కు పంపిస్తున్నామన్నారు. కార్యక్రమంలో జివిఎంసి ప్రధాన వైద్యాధికారి డాక్టర్ కెఎస్ఎల్‌జి. శాస్త్రి, జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము, ఎఎంహెచ్ఒ డాక్టర్ ఎన్. కిషోర్, పర్యవేక్షక ఇంజనీర్ కృష్ణారావు పాల్గొన్నారు.

తైక్వాండో ఛాంపియన్‌షిప్ పోటీల్లో

అనిల్ నీరుకొండ దంత వైద్య విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి -తగరపువలస : స్థానిక సంగివలస అనిల్ నీరుకొండ ఇనిస్టిట్యూట్ ఆఫ్ డెంటల్ సైన్సెస్ ఆవరణలో సోమవారం ఎపి అమెచ్యూర్ తైక్వాండో అసోసియేషన్ ఉపాధ్యక్షులు బి ఆనందరావు పర్యవేక్షణలో తైక్వాండో మహిళా జట్టు ఎంపిక జరిగిందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వంశీకృష్ణారెడ్డి తెలిపారు. డాక్టర్ వైఎస్సార్, యుహెచ్ఎస్ ఇంటర్ యూనివర్సిటీ తైక్వాండో ఛాంపియన్ షిప్ పోటీల్లో అనిల్ నీరుకొండ దంత వైద్యకళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు తెలిపారు. 57 కిలోల లోపు విభాగంలో డెంటల్ విద్యార్థిని ఎల్.భువనేశ్వరి, 63 కిలోల విభాగంలో మెడిసిన్ విద్యార్థిని ఆర్ ప్రసూన మెరుగైన ప్రతిభ కనబరిచారన్నారు. అమత్‌సర్‌లోని గురునానక్‌దేవ్ యూనివర్సిటీలో వచ్చేనెల 9 నుంచి 12వరకు జరగనున్న ఆలిండియా ఇంటర్ యూనివర్సిటీ ఉమెన్స్ తైక్వాండో పోటీలకు వీరిద్దరూ పాల్గొంటారన్నారు. ఈ సందర్భంగా



తైక్వాండో పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో కోచ్‌లు

కాలేజీలో విద్యార్థులిద్దరినీ సంస్థ ప్రధాన కార్యదర్శి డిజె భరత్‌రెడ్డి, సిఇఒనిరంజన్, మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ రాధామాధవ్ త్రిపాఠి, వైస్ ప్రిన్సిపల్స్ శ్రీధర్ రెడ్డి అనిల్ అభినందించారు. కార్యక్రమంలో ఎఒలు జెవిడి నాయుడు, శివప్రసాద్, ఫిజికల్ డైరెక్టర్ గున్నాజీ, తైక్వాండో కోచ్‌లు వినీష్, హేమంత్, శ్రీనాథ్ పాల్గొన్నారు.

రూ.8.20కోట్లతో ఆరు పాఠశాలల అభివృద్ధి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

ప్రజాశక్తి -భీమునిపట్నం :సామాజికాభివృద్ధికి, చైతన్యానికి చదువు దోహదపడుతుందని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు.సోమవారం జివిఎంసి స్మార్ట్ సిటీ కార్పొరేషన్ లిమిటెడ్ ఆధ్వర్యంలో సిటీస్ ప్రాజెక్ట్ లో భాగంగా రూ.8.20 కోట్లతో ఒకటో జోన్ పరిధిలోని ఆరు జివిఎంసి ప్రాథమిక పాఠశాలల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. స్థానిక పిఎన్ఎం ప్రాథమిక పాఠశాల వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే ముత్తంశెట్టి మాట్లాడుతూ, సిటీస్ ప్రాజెక్ట్‌లో భాగంగా జివిఎంసి పరిధిలోని 147 పాఠశాలలను భవనాలను పునరుద్ధరణ, ఆధునికీకరణ, మరుగుదొడ్ల పునర్నిర్మాణం, ఆటస్థలాల కల్పన, అభివృద్ధి, ఇంటర్నెట్‌తో కూడిన స్మార్ట్ తరగతి గదులు, ఇతర అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. భీమిలి జోన్‌లో ఆరు పాఠశాలలను అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ గంటా అప్పలకొండ, కో ఆప్షన్ సభ్యులు కొప్పల ప్రభావతి, జెడ్‌సి ఎస్.వెంకటరమణ, పిఎసిఎస్ అధ్యక్షులు అక్కరమాని రామునాయుడు, పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, మాజీ కౌన్సిలర్లు ఎం.లక్ష్మణరావు, కె ఎల్లాజీ, వైసిపి నాయకులు ఎం షణ్ముఖరావు, ఎస్ కరుణాకరరెడ్డి పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి - ఆరిలోవ : 9వ వార్డు సింహాగిరికాలనీ కొండవాలు ప్రాంతంలో సోమవారం వైసిపి సీనియర్ నేత ఇజ్జాడ సత్యనారాయణ ఆధ్వర్యంలో మెడికవర్ ఆసుపత్రి సౌజన్యంతో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది.. 250 మందికి ఇసిజి, బిపి, సుగర్ పరీక్షలను ఉచితంగా నిర్వహించి, మందులు అందజేశారు. 90 మందికి కేన్సన్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మెడికవర్ వైద్య నిపుణులు డాక్టర్ ఎస్.కుసుమ, డాక్టర్ చిన్నికృష్ణ, 9వవార్డు వైసిపి అధ్యక్షులు నీలపు రామ్మోహన్‌రెడ్డి, గ్రామ పెద్దలు నాగేశ్వరరావు, ఈశ్వరరావు, అప్పలరాజు, అర్‌పి



రోగులకు వైద్యపరీక్షలు చేస్తున్న వైద్యసిబ్బంది

గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

జన జాగృతి పాదయాత్రకు నీరాజనం



పాదయాత్రలో లక్ష్మీనరసింహతో మాజీ ఎమ్మెల్యే బాబ్జి

ప్రజాశక్తి -మాధవధార : ఉత్తర నియోజకవర్గంలో 45వ వార్డు, 14వ వార్డుల్లో డాక్టర్ లక్ష్మీనరసింహ చేపట్టిన బడుగు, బలహీన వర్గాల జనజాగృతి పాదయాత్రకు జనం నీరాజనం పలుకుతున్నారు. వార్డులో పర్యటిస్తూ, బిసి, ఎస్‌సి, ఎస్‌టి మైనార్టీల సమస్యలను తెలుసుకుంటూ, వాటి పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటానని భరోసానిస్తూ డాక్టర్ లక్ష్మీనరసింహ పాదయాత్ర నిర్వమిస్తున్నారు. పాదయాత్రకు బీసీ నేత, మాజీ ఎమ్మెల్యే గండిబాబ్జి సంఘీభావం ప్రకటించి, డాక్టర్ లక్ష్మీనరసింహతో కలిసి పాదయాత్రలో పాల్గొన్నారు. పాదయాత్రలో 46వ వార్డు ప్రెసిడెంట్ కాశీ, యశ్వంత్, కార్తీక్, భీశెట్టి వరలక్ష్మి పాల్గొన్నారు

విద్యార్థులకు పద్మపూజిత స్కాలర్‌షిప్స్



స్కాలర్‌షిప్‌లను అందజేస్తున్న చైర్మన్ బసవరాజు

ప్రజాశక్తి- సీతమ్మధార : విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత శిఖరాలకు ఎదగాలని పద్మపూజిత వీల్స్‌మార్ట్ ఆటోఫైనాన్స్ సంస్థ చైర్మన్ బసవరాజు సూచించారు. సోమవారం పద్మపూజిత ఫౌండేషన్ ఆధ్వర్యంలో దొండపర్తిలోని సంస్థ కార్యాలయం 57 మంది విద్యార్థులకు రూ.8.50 లక్షల స్కాలర్‌షిప్ చెక్కులను బసవరాజు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఏటా తమ ఫౌండేషన్ ద్వారా విద్యార్థులను ప్రోత్సాహించేందుకు స్కాలర్‌షిప్‌లను అందజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో పద్మ పూజిత వీల్స్‌మార్ట్ పార్టనర్స్ సాయిబాబా, శ్రీనివాసరావు, వీరేంద్ర త్రినాథ్, వేణు పాల్గొన్నారు

చేనేత సమస్యలపై మంత్రి అమర్‌కు వినతి



మంత్రి అమర్‌కు చేనేత సమస్యలను విన్నవిస్తున్న నేతలు

ప్రజాశక్తి -గాజువాక : చేనేత కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ, మంత్రి అమర్‌నాథ్‌కు ఆల్ ఇండియా వీవర్స్ అసోసియేషన్ నేత పప్పు రాజారావు ఆధ్వర్యంలో సంఘ సభ్యులు సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. సహకార సంఘ, చేనేత వస్త్రాలు విక్రయాలకు రిబేట్ పథకాన్ని కొనసాగించాలని సహకార సంఘాల నగదు పరపతి, పావలా వడ్డీ పథకం అమలు చేసి, రుణ భారం తగ్గించాలని కోరారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ప్రజాశక్తి -పిఎం పాలెం : పిఎం.పాలెం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పిఎం పాలెం మొదటి, రెండవ, మూడవ బస్‌స్టాప్ ప్రాంతాలు, ఎపిహెచ్‌బి కాలనీ, అర్‌హెచ్ కాలనీ, లక్ష్మివానిపాలెం, హెచ్‌పిసిఎల్ లేఅవుట్, ఎఫ్‌సిఐ లేఅవుట్, అశోక్ నగర్, సౌండ్ అండ్ సౌండ్ లేఅవుట్, తులసినగర్ ప్రాంతాలలో మంగళవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ట్రాన్స్‌కో ఎఇ డి.నరేష్ తెలిపారు. మూడో జోన్ ట్రాన్స్‌కో ఆపరేషనల్ డిఇఇ పోలాకి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు నిర్వహణ పనుల్లో భాగంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని, వినియోగదారులు సహకరించాలని ఎఇ కోరారు.

సుపరిపాలన వారోత్సవాలపై కలెక్టర్ సమావేశం


మాట్లాడుతున్న కలెక్టర్ రవి

ప్రజాశక్తి-అనకాపల్లి : ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించడమే సూపరిపాలన వారోత్సవాల ఉద్దేశమని కలెక్టర్ రవి పఠాన్ శెట్టి అన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం వివిధ శాఖల అధికారులతో సమావేశమయ్యారు. ఈనెల 19 నుంచి 25 వరకు వారోత్సవాలను నిర్వహిస్తామని చెప్పారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సంక్షేమ పథకాలను పూర్తిస్థాయిలో ప్రజలకు చేరువయ్యేలా అధికారులు పనిచేయాలని ఆదేశించారు.


బాధితురాలికి సెల్ ఫోన్ అందజేస్తున్న ఎస్‌పి గౌతమి శాలి

రూ.25 లక్షల విలువైన ఫోన్లు బాధితులకు అందజేత

ప్రజాశక్తి-అనకాపల్లి : పోగొట్టుకున్న సుమారు రూ.25 లక్షల విలువ చేసే 131 సెల్ ఫోన్లను రికవరీ చేసి సోమవారం బాధితులకు ఎస్పీ గౌతమి శాలి చేతుల మీదుగా అందజేశారు. స్థానిక ఎస్పీ కార్యాలయంలో మొబైల్ రికవరీ మేళ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఫోను పోగొట్టుకున్న బాధితులు జిల్లా పోలీస్ వాట్సాప్ నెంబర్ 9505200100కు హాయి టైప్ చేసి akp-mobiletracker.in లింకు నొక్కడం ద్వారా పోయిన మొబైల్ ఎక్కడ ఉందో ట్రేస్ చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ విధంగా 131 ఫోన్లను రికవరీ చేసామన్నారు. ఈ సందర్భంగా పోలీసు సిబ్బందిని ఆమె అభినందించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ విజయభాస్కర్, ఐటీ కోర్ విభాగం ఎస్సై రఘు వర్మ పాల్గొన్నారు.

నునపర్తిలో ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-అచ్యుతాపురం : మండలంలోని నునపర్తి గ్రామ సచివాలయం ఆవరణలో సోమవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ టి.వెంకటరమణ, డాక్టర్ వాసు ఆధ్వర్యాన 92 మందికి 14 రకాల వైద్య పరీక్షలు నిర్వహించి 67 రకాల మందులు పంపిణీ చేశారు. అంగన్వాడీ కేంద్రం, ప్రభుత్వ పాఠశాల పిల్లలు, గ్రామంలోని వృద్ధుల దగ్గరకి వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. 108 వాహనం అందుబాటులో ఉంచి ఈసీజీ పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో సిహెచ్‌ఓ నవ్య, జానకి, హెచ్‌ఎస్ ఎం ఎరుకు నాయుడు, హెచ్‌వి రాజేశ్వర్, డిఈఓ అనంతలక్ష్మి, ఎఎన్ఎం. భావన, ఆశ వర్కర్స్, సచివాలయ సిబ్బంది, గ్రామ వాలంటీర్లు పాల్గొన్నారు.

తగ్గిన టమోట ధర

ప్రజాశక్తి-కశింకోట : మండలంలోని తాళ్ళపాలెంలో సోమవారం జరిగిన వారపు సంతలో టమాట ధర తగ్గుముఖం పట్టింది. ఒక ట్రే టమాటాలు రూ.250కు అమ్ముడయ్యాయి. ఒక ట్రేలో సూమారు 13 నుండి 15 కేజీలు వరకు టమాటాలు ఉంటాయి. ఈ లెక్కన కేజీ రూ.17 పడింది. అయితే బయట మార్కెట్‌లో ప్రస్తుతం కేజీ రూ.20 నుండి రూ.25 వరకు అమ్మకాలు జరుగుతున్నాయి. గతవారం ట్రే రూ.500 వరకు అమ్మకాలు జరిగాయి. వారం వారం టమాట ధర తగ్గుతుండడంతో రైతులు పెట్టిన పెట్టుబడులు రావని ఆందోళన చెందుతున్నారు.


వారపు సంతకు భారీగా వచ్చిన టమోటాలు

ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో మోసపోవద్దు


సర్పంచ్‌లు, రైతులతో సమావేశమైన గోవాడ సుగర్స్ ఎమ్‌డి సన్యాసినాయుడు

ప్రజాశక్తి-దేవరాపల్లి

ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో చెరకు రైతులు మోసపోవద్దని గోవాడ సుగర్ ఫ్యాక్టరీ మేనేజింగ్ డైరెక్టర్ వి.సన్యాసినాయుడు హితవుపలికారు. మండలంలోని తెలుగుపూడి గ్రామ సచివాలయం వద్ద సోమవారం తెనుగుపూడి, వెంకటరాజపురం, మారేపల్లి, గరిసింగి గ్రామాల సర్పంచ్ల అధ్వర్యంలో సభ్య రైతులో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది టన్ను చెరకుకు రూ.2,821 మద్దతు ధర ఇస్తున్నట్లు చెప్పారు. ప్రైవేటు ఫ్యాక్టరీలు, ప్రైవేట్ బెల్లం క్రషర్లకు కాకుండా ఫ్యాక్టరీకి చెరకు సరఫరా చేయాలని సూచించారు. ఫాక్టరీ యాజమాన్యం వారం రోజుల లోపల తెనుగుపూడిలో ఈ క్రషింగ్ సీజన్‌కు తాత్కాలిక చెరకు కొనుగోలు కేంద్రం (కాటా) ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. దీనిని రైతులు సద్వినియోగం చేసుకొని లాభం పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు బూరె బాబురావు, గూడేపు రాము, దాసరి సంతోష్ కుమార్, అవుగడ్డ కన్నతల్లి, ఎంపీటీసీలు అవుగడ్డ రమాదేవి, వైసిపి నాయకులు అవుగడ్డ రామ్మూర్తినాయుడు, ఫ్యాక్టరీ చెరకు అభివృద్ధి అధికారి కలిమి రామం, చెరకు కొనుగోలు కేంద్రం వ్యవసాయ అధికారి కృష్ణమూర్తి, ఫీల్డ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నల్లమారమ్మ ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన


శంకుస్థాపన చేస్తున్న ముత్యాల వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి- అనకాపల్లి

మండలంలోని కొత్తూరు పంచాయతీ పరిధి రామాపురం కాలనీలో నల్లమారమ్మ అమ్మవారి నూతన ఆలయం నిర్మాణానికి ముత్యాల గ్రూప్ ఆఫ్ ఇండస్ట్రీస్ అధినేత ముత్యాల వెంకటేశ్వరరావు, ఆయన తనయుడు సంజయ్ సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ముత్యాల వెంకటేశ్వరరావు, సంజయ్‌కు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ముత్యాల వెంకటేశ్వరరావు, సంజయ్‌ను దుస్సాలువ, గజమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆలయ ఛైర్మన్ జ్యోతుల గణేష్ మాట్లాడుతూ కొన్ని సంవత్సరాలుగా ఆలయ నిర్మాణం చేపట్టేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. ఇప్పటికి ప్రముఖ వ్యాపారవేత్త ముత్యాల వెంకటేశ్వరరావు సహకారంతో ఆలయ నిర్మాణం సాకారం అవుతున్నందుకు గ్రామం తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షులు పెంటకోట కృష్ణ, వైస్ ఛైర్మన్ చెక్క రాంబాబు, కార్యదర్శి అయిత రాము, కోశాధికారి ఎండి జిలానీ, కొవ్వాడ వాసు, పూడి సతీష్, ఎంవిఆర్ యువసేన ప్రతినిధులు పాల్గొన్నారు.

ఘనంగా ఎంపీపీ సూరిబాబు జన్మదిన వేడుకలు


సూరిబాబుకు కేక్ తినిపిస్తున్న మంత్రి అమర్‌నాథ్, చిత్రంలో బూడి

ప్రజాశక్తి-అనకాపల్లి

అనకాపల్లి ఎంపిపి, మండల పరిషత్ అధ్యక్షుల సంఘం జిల్లా అధ్యక్షులు గొర్లి సూరిబాబు జన్మదిన వేడుకలు సోమవారం ఆయన స్వగృహంలో ఘనంగా నిర్వహించారు. వైసిపి నాయకులు, ఎంపీటీసీలు, సర్పంచులు, అధికారులు, అనధికారులు ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. దీంతో గోపాలపురంలో సందడి నెలకొంది. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు, రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ కేక్ కట్ చేసి సూరిబాబుకు తినిపించారు. ఆయనను దుస్తాలువ, గజమాలతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ సూరిబాబును ఆదర్శంగా చేసుకొని కార్యకర్తలు మరింత కష్టించి రానున్న ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పి వైస్ ఛైర్‌పర్సన్ బీవీ సత్యవతి, వైసిపి రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్, నాయకులు మందపాటి జానకి రామరాజు, మళ్ల బుల్లిబాబు, పలక రవి, జాజుల రమేష్, భీశెట్టి జగన్, తహాశీల్దారు గంగాధర్‌రావు, ఎంపీడీవో చంద్రశేఖర్, పలువురు సర్పంచ్‌లు, మండల స్థాయి అధికారులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

21న షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు

ప్రజాశక్తి- చోడవరం

ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి 50వ జన్మదినం సందర్భంగా ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ ఆధ్వర్యంలో ఈ నెల 21న షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు జ్యోతుల రమేష్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. చోడవరం-చీడికాడ రోడ్డులో ఉన్న కృష్ణ షటల్ బ్యాడ్మింటన్ అకాడమీ ఇండోర్ స్టేడియంలో ఈ పోటీలు బుధవారం ఉదయం 9 గంటల నుండి సాయంత్రం జరుగుతాయని పేర్కొన్నారు. విజేతలకు ధర్మశ్రీ చేతుల మీదుగా 21న సాయంత్రం బహుమతుల అందజేస్తామని వెల్లడించారు. ఆసక్తిగల క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొనవలసిందిగా ఆయన కోరారు.


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న సిఐ తదితరులు

జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి-అచ్యుతాపురం : ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి జన్మదిన సందర్భంగా అచ్చుతాపురం గ్రామ సర్పంచ్ కె విమల నాయుడు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జిల్లా స్థాయి కబడ్డీ పోటీలను సిఐ మురళీరావు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసానికి, శారీరక దారుఢ్యానికి ఉపయోగపడతాయని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు దేశం శెట్టి శంకర్రావు, జి నూకరాజు, గంగిరెడ్డి రాము, ఎంపీటీసీ సభ్యుడు డి శ్రీను, పల్లి శేషగిరిరావు, నర్మాల కుమార్, జి ప్రసన్న కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నాగులాపల్లి గ్రోయిన్ మరమ్మతులు చేపట్టాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : నాగులాపల్లి గ్రోయిన్ మరమ్మతులు చేపట్టి రైతులకు సాగునీరు అందించేందుకు చర్యలు చేపట్టాలని కోరుతూ అఖిలపక్షాల ఆధ్వర్యంలో ఇరిగేషన్ శాఖ అధికారులు, ఆర్డీవో చిన్న కృష్ణకు వేరువేరుగా సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనకాపల్లి, కసింకోట, మునగపాక మండలాల రైతులకు ఉపయోగపడే ఈ గ్రోయిన్ మరమ్మతులకు గురై ఐదేళ్లుగా సాగునీరు అందక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. వినతి పత్రం అందజేసిన వారిలో అఖిలపక్ష నాయకులు సూదికొండ మాణిక్యాలరావు, కాళ్ల వెంకట సత్యనారాయణ, కోన లక్ష్మణ, వాయబోయిన శేఖర్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

త్వరగా గృహ సారథుల నియామకం

ప్రజాశక్తి-పరవాడ : ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డి అదేశం మేరకు వైసిపి తరుపున ప్రతి క్లస్టర్‌కు ఇద్దరు గృహ సారథుల నియామకం త్వరగా చేపట్టాలని పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అన్నారు. మండలంలోని దలాయిపాలెంలో ఉన్న తన క్యాంపు కార్యాలయంలో సోమవారం వైసిపి పరవాడ మండల ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సచివాలయం పరిధిలో ముగ్గురు కన్వీనర్లను నియమించాలని సూచించారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి జన్మదినం సందర్భంగా ఈ నెల 20న మొక్కలు నాటే కార్యక్రమం, 21న మెగా రక్తదాన శిబిరం నిర్వహించాలని పార్టీ శ్రేణులకు సూచించారు. ఈ సమావేశంలో వైసిపి రాష్ట్ర సిఇసి సభ్యులు పైల శ్రీనివాసరావు, మండల అధ్యక్షులు కోన రామారావు, వైస్ ఎంపిపిలు బూసరాజు, బంధం నాగేశ్వరరావు, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

8వ తరగతి విద్యార్థులకు 22న ట్యాబ్‌ల పంపిణీ

ప్రజాశక్తి - దేవరాపల్లి : మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 8వ తరగతి ఈ నెల 22న ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు చేతులు మీదుగా పంపిణీ చేయనున్నట్లు మండల విద్యాశాఖ అధికారి సిహెచ్.రవీంద్రబాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని 381 మంది విద్యార్థులు, 65 మంది ఉపాధ్యాయులు ఉండగా, కేవలం 150 ట్యాబ్లు వచ్చినట్లు పేర్కొన్నారు.

లారీ ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట : మండలంలోని కెపి అగ్రహారం-కొండపాలెం గ్రామాల మధ్య సరుగుడు లోడుతో వస్తున్న లారీ ఢీకొని సోమవారం రాత్రి ఢీకిని గున్నెంపూడి గ్రామానికి చెందిన బత్తుల నారాయణమూర్తిని(65) అక్కడికక్కడే మృతి చెందారు. తాపీ మేస్త్రిగా పనిచేస్తున్న నారాయణమూర్తి కొన్నెంపూడి గ్రామంలో ఇంటి నిర్మాణ పనికి వెళ్లి స్వగ్రామానికి టీవీఎస్ వాహనంపై తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఘటన స్థలాన్ని చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చోడవరం తరలించారు.


కలెక్టరేట్ వద్ద ఆందోళన కెఎన్ఆర్ పేట గ్రామస్తులు

ప్రభుత్వ భూమిని ప్రజావసరాలకు వినియోగించాలని ఆందోళన

ప్రజాశక్తి-అనకాపల్లి రూరల్ : తమ గ్రామంలో ఉన్న ప్రభుత్వ భూమిని ప్రజావసరాలకు మాత్రమే వినియోగించాలని కోరుతూ సోమవారం కలెక్టరేట్ ముందు మండలంలోని రాజుపాలెం రెవెన్యూ పరిధి కొత్తూరు నరసింగరావుపేట గ్రామస్తులు ఆందోళన నిర్వహించారు. వుడా ఆధీనంలో ఉన్న సర్వే నెంబర్లు 75/1, 75/3, 75/4లో ఉన్న ప్రభుత్వ భూమిని గ్రామ అవసరాలైన గ్రంథాలయం, వ్యాయామశాల, కళ్యాణ మండపం, కమ్యూనిటీ హాల్ వంటి వాటికే వినియోగించాలని డిమాండ్ చేశారు. ఈ స్థలాన్ని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయానికి కేటాయిస్తే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. అనంతరం స్పందనలో ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో గ్రామ యువత పాల్గొన్నారు.


మాట్లాడుతున్న చౌడువాడ సర్పంచ్ ఎరుకునాయుడు

పంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై గ్రామసభలు

ప్రజాశక్తి- కె.కోటపాడు : గ్రామ పంచాయితీల అభివృద్ధి ప్రణాళికలపై మండలంలోని అన్ని గ్రామ సచివాలయాల్లో సోమవారం సర్పంచ్‌ల ఆధ్వర్యంలో గ్రామసభలు నిర్వహించారు. 2023-24 ఆర్థిక సంవత్సరం అభివృద్ధి ప్రణాళికలను గ్రామ సభలో చర్చించారు. తాగునీరు, విద్యుత్తు, వైద్యం, విద్య, పారిశుధ్యం, మహిళా సాధికారిక మహిళ అభివృద్ధి తదితర అంశాలపై కార్యాచరణ ప్రణాళిక తయారు చేశారు. చౌడువాడలో జరిగిన గ్రామసభలో స్థానిక సర్పంచ్ దాడి ఎరుకు నాయుడు మాట్లాడుతూ గ్రామ అభివృద్ధికి ప్రజలందరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రొంగలి సూర్యనారాయణ, ఎంపీటీసీ ఏటుకూరి రాజేష్, పంచాయతీ కార్యదర్శి నక్క రామనాయుడు పాల్గొన్నారు.

పేదోడికి అన్నం దూరం చేసిన జగన్

ప్రజాశక్తి బుచ్చయ్యపేట : అన్న క్యాంటీన్లను మూసివేసి పేదవాడికి పట్టెడు అన్నం దూరం చేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందని టిడిపి చోడవరం నియోజకవర్గం ఇన్‌ఛార్జి బత్తుల తాతయ్య బాబు ఆరోపించారు. ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో భాగంగా సోమవారం మండలంలోని మల్లం, దిబ్బిడి గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రాన్ని అప్పులు ఊబిలో నెట్టిన జగన్మోహన్ రెడ్డిని రాబోయే ఎన్నికల్లో బంగాళాఖాతంలో కలపాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గొలగాన రాజారావు, మాజీ ఎంపీటీసీలు జర్ర శ్రీను, గొన్నాబత్తుల శ్రీనివాసరావు, టిడిపి నాయకులు గోకవాడ కోటేశ్వరరావు, మలిరెడ్డి బుజ్జి, ముమ్మిన సూర్యనారాయణ, సేనాపతి మణికంఠ, పెదరెడ్ల రాజు, ముమ్మిన నాగరాజు తదితరులు పాల్గొన్నారు.


ప్రజలతో మాట్లాడుతున్న టిడిపి నేత తాతయ్యబాబు

రాష్ట్రస్థాయి యోగా పోటీలకు విద్యార్థుల ఎంపిక


సర్టిఫికెట్లు చూపిస్తున్న విద్యార్థులు

ప్రజాశక్తి- చోడవరం

ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో జరిగిన యోగా పోటీలలో చోడవరం పతంజలి యోగ శిక్షణ కేంద్రానికి చెందిన తొమ్మిది మంది విద్యార్థులు రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు ఎంపికయ్యారు. 8 నుండి 12 సంవత్సరాల బాలుర విభాగంలో జి.హేమంత్ శ్రీను, బి.చరణ్, పి.హరీష్, 12 నుండి 14 సంవత్సరాల బాలురు విభాగంలో పి.క్రాంతి సాగర్, వి.పూర్ణచంద్రరావు, ఎ.హేమంత్ కుమార్, 12 నుండి 14 సంవత్సరాల బాలికల విభాగంలో పి.వెన్నెల్రశ్రీ, 14 నుండి 17 సంవత్సరాల బాలురు విభాగంలో పి.పవన్ కుమార్, ఎ.జయరామ్ చరణ్ విజయం సాధించారు. వీరంతా ఈనెల 25 తిరుపతిలో జరగబోయే రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో పాల్గొంటారని యోగ గురువు పుల్లేటి సతీష్ తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు పతంజలి యోగ శిక్షణ కేంద్ర చైర్మన్ పసుమర్తి అశోక్, అడ్వకేట్ శ్రీనివాసరావు, ఒరుగంటి రాంబాబు, ఉషోదయ విద్యాసంస్థల చైర్మన్ జెర్రిపోతుల రమణాజీ, యోగా టీచర్స్ భోగవిల్లి గణేష్, కొట్టాపు హరి కిరణ్, పసుమర్తి నానాజీ, రవితేజ తదితరులు అభినందించారు.

గ్రామాల్లో 'గడపగడపకు మన ప్రభుత్వం'

ప్రజాశక్తి- కె.కోటపాడు

మండలంలో దాలివలస గ్రామంలో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు వివిధ శాఖల అధికారులతో కలిసి చేపట్టారు. గ్రామంలో అభివృద్ధి పథకాల పనితీరును పరిశీలించారు. గ్రామంలో అభివృద్ధికి కోటి రూపాయలు మంజూరు చేసినట్లు, జల్ జీవన్ మిషన్ కింద 500 మంచి నీటి కుళాయికు రూ.52 లక్షలు మంజూరు చేసినట్లు చెప్పారు. రూ.50 లక్షలతో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, విద్యుత్ స్తంభాలు మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి రెడ్డి జగన్ మోహన్, జడ్పీటీసీ ఈర్లే అనురాధ, ఎంపిటీసీలు, సర్పంచులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

మునగపాక రూరల్ : మండలంలోని వాడ్రాపల్లి గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఎలమంచిలి ఎమ్మెల్యే యువి.రమణమూర్తి రాజు సోమవారం నిర్వహించారు. గ్రామంలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి మాజీ చైర్మన్ యు సుకుమార్ వర్మ, జడ్పిటిసి పెంటకోట స్వామి సత్యనారాయణ, ఎంపీపీ మళ్ల జయలక్ష్మి, వాడ్రాపల్లి సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు, వైసిపి నాయకులు ఆడారి గణపతి అచ్చం నాయుడు, రమణమ్మ, ఎంపిడిఓ రవికుమార్, తహశీల్దారు బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

22న విద్య, ఉపాధి రంగాలపై సదస్సు

ప్రజాశక్తి-అనకాపల్లి : విద్య, ఉపాధి రంగాల సమస్యలపై ఈనెల 22న విశాఖ డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో ఉత్తరాంధ్ర విద్యార్థుల సదస్సు నిర్వహించనున్నట్లు పిడిఎస్ఓ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.భాస్కర్ తెలిపారు. సోమవారం స్థానిక ఎఎంఎఎల్ కళాశాల వద్ద సోమవారం సదస్సు పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పిడిఎస్ఓ నాయకులు ఏ.శివాజీ, ఎస్.సన్యాసినాయుడు, ఆర్.మహేష్ తదితరులు పాల్గొన్నారు.

అలమండలో పశువైద్య సేవలు

ప్రజాశక్తి- దేవరాపల్లి : మండలంలోని ఎం.అలమండ గ్రామంలో పశు వైద్యాధికారి మంజుశ్రాణి సోమవారం పశు వైద్య సేవలు నిర్వహించారు. పాడి రైతు శ్రీను పాడి గేదెకు కె. కోటపాడు వైద్యులు బైరాగితో కలిసి మందగుడి ఆపరేషన్ చేశారు. అనంతరం రైతులకు పశువుల్లో వచ్చే సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు.

పంచాయతీ కార్యదర్శుల కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి- దేవరాపల్లి : మండలంలోని గ్రామ పంచాయితీ కార్యదర్శుల మండల కార్యవర్గం ఎన్నిక సోమవారం ఏకగ్రీవంగా జరిగింది. సంఘం మండల అధ్యక్షులుగా జి.సంతోషి నళిని, గౌరవ అధ్యక్షులుగా లెక్కల లింగన్న, ఉపాధ్యక్షులుగా టి.పవన్, కార్యదర్శిగా పి.అప్పలనాయుడు, ట్రెజరర్‌గా కె.సుధాకర్ ఎన్నికయ్యారు. అనంతరం ఎంపీడీవో సిహెచ్.సుబ్బలక్ష్మిని కలిసి కార్యవర్గ నియామక పత్రాన్ని అందజేశారు.

బిసి స్టూడెంట్స్ అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా హేమచంద్రనాయుడు

ప్రజాశక్తి-పరవాడ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బీసీ స్టూడెంట్స్ అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా గొన్న కళాశాల ఫౌండర్ జివి నాయుడు తనయుడు గొన్న హేమ చంద్ నాయుడును ఎంపికయ్యారు. ఈ మేరకు జాతీయ బీసీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య, రాష్ట్ర బీసీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు ఎన్.మారేష్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నియామక పత్రాన్ని ఆర్.కృష్ణయ్య చేతుల మీదుగా ఢిల్లీలోని ఆయన నివాసంలో హేమచంద్రనాయుడుకు అందజేశారు.

స్పందనకు 179 అర్జీలు

ప్రజాశక్తి-అనకాపల్లి : స్థానిక కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో వివిధ సమస్యలకు చెందిన 179 అర్జీలు అందాయి. వీటిని జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి, డిఆర్ఓ వెంకటరమణ స్వీకరించారు. ఈసందర్భంగా జెసి మాట్లాడుతూ స్పందనలో అర్జీ పెట్టుకున్న వారికి నియమిత కాలంలో సమాధానం ఇవ్వాలని, లేకుంటే పదేపదే అదే సమస్యపై అర్జీలు వస్తాయని తెలిపారు. వికలాంగుల వద్దకు నేరుగా వెళ్లి డిఆర్ఓ వెంకటరమణ అర్జీలను స్వీకరించారు.

త్వరితగతిన జల్ జీవన్ మిషన్ పనులు

ప్రజాశక్తి-అనకాపల్లి : జల్ జీవన్ మిషన్ పథకం కింద మండలంలోని తుమ్మపాల పంచాయితీ పరిధిలో జరుగుతున్న ఇంటింటికి కుళాయిల పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సర్పంచ్ తట్ట పెంటయ్యనాయుడు ఆదేశించారు. జల్ జీవన్ మిషన్ పనులపై సోమవారం సర్పంచ్ తట్ట పెంటయ్య నాయుడు అధ్యక్షతన సమీక్ష నిర్వహించారు. గ్రామంలో ఇప్పటి వరకు ఎన్ని కుళాయిలు వేశారు, ఇంకా ఎన్నింటికి వెయ్యాల్సి ఉంది అనేదానిపై గ్రామ ఇంజనీరింగ్ అసిస్టెంట్‌ని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌డబ్ల్యుఎస్ జల్ జీవన్ మిషన్ పథకం సిబ్బంది చక్రవర్తి, హేమ, అప్పారావు, పంచాయితీ ఈఓ కె.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ పొదుపుపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి- దేవరాపల్లి : జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా స్థానిక విద్యుత్ కార్యాలయం నుంచి నాలుగు రోడ్ల కూడలి వరకు సోమవారం ర్యాలీ నిర్వహించి ప్రజలకు విద్యుత్ పొదుపుపై అవగాహన కల్పించారు. అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయం వద్ద పోస్టర్లు అతికించారు. విద్యుత్ శాఖ ఎఇ కర్రి శంకర్రావు లైన్‌మెన్ బొడ్డు రాము, షిఫ్ట్ ఆపరేటర్లు, సచివాలయ అసిస్టెంట్ లైన్‌మెన్లు పాల్గొన్నారు.

ఎపిఎఇఓ సంఘం రాష్ట్ర కార్యదర్శిగా సత్యనారాయణ

ప్రజాశక్తి-అనకాపల్లి : ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ విస్తరణ అధికారుల సంఘం రాష్ట్ర కార్యదర్శిగా కెవి సత్యనారాయణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఏ మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్షులు డి వేణు మాధవరావు ఒక ప్రకటన ద్వారా తెలిపారు. ప్రస్తుతం సత్యనారాయణ అనకాపల్లి వ్యవసాయ విస్తరణ అధికారిగా విధులు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఉమ్మడి విశాఖ జిల్లా వ్యవసాయ విస్తరణ అధికారుల సంఘం సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.


ఆందోళన చేస్తున్న నేవీ నిర్వాసితులు

50వ రోజుకు నేవీ నిర్వాసితుల ఆందోళన

ప్రజాశక్తి- రాంబిల్లి : తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ నేవీ మెయిన్ గేట్ ముందు ఎన్ఎఓబి నిర్వాసితులు చేస్తున్న ఆందోళన 50వ రోజుకు చేరింది. సోమవారం ఎనిమిది గ్రామాల నిర్వాసితులు ప్రధాన రహదారిపై బైఠాయించి పెద్ద పెట్టున నినాదాలు చేశారు. 50 రోజులుగా ధర్నా చేస్తున్నా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు, జిల్లా అధికారులు స్పందించకపోవడం అన్యాయమన్నారు. ఇంత వరకు తమ డిమాండ్లపై ఎటువంటి సమాధానం చెప్పలేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి జెట్టీ నిర్మాణం చేయాలని, పెండింగ్ ప్యాకేజీలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నేవీ నిర్వాసిత జెఎసి నాయకులు, నిర్వాసితులు పాల్గొన్నారు

వికలాంగులకు ఆటల పోటీలు

ప్రజాశక్తి-అనకాపల్లి : ప్రపంచ వికలాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సోమవారం వికలాంగులకు ఆటల పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను అనకాపల్లి జిల్లా వికలాంగుల, హిజ్రాల సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ బివిజి జగదీష్ ప్రారంభించారు. జిల్లా నలుమూలల నుంచి 400 మంది వికలాంగులకు పాల్గొనగా, వారికి ట్రై సైకిల్ రేస్, రన్నింగ్, జావలిన్ త్రో, డిస్కస్ త్రో, షాట్ పుట్, క్రికెట్, క్యారమ్స్, చెస్, పాటలు తదితర పోటీలు నిర్వహించారు. విజేతలకు ఎస్టి గ్రూప్స్ అధినేత కాండ్రేగుల శ్రీరామ్, నాలం ఆశ కుమారి, కొర్రప్రోలు వెంకటేశ్వరరావు, రవితేజ మాస్టర్, గుడివాడ వరలక్ష్మి, అమరపల్లి రామన్ తదితర దాతల సహకారంతో బహుమతులను ఏడి జగదీష్ చేతుల మీదుగా ప్రదానం చేశారు. కార్యక్రమంలో పాత్రపల్లి వీరు యాదవ్, అఖిలపక్ష నాయకులు రాజాన దొరబాబు, సూదికొండ మాణిక్యాల రావు, కనిశెట్టి సురేష్ బాబు పాల్గొన్నారు.

25న ఘంటసాల శతజయంతి వేడుకలు

ప్రజాశక్తి-అనకాపల్లి : ఘంటసాల శతజయంతి వేడుకలు ఈ నెల 25న నిర్వహించనున్నట్లు స్థానిక సిద్ధార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు బల్ల నాగభూషణం తెలిపారు. ఈ మేరకు స్థానిక దిశ పోలీస్ స్టేషన్ సిఐ టి.లక్ష్మి చేతుల మీదుగా కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక వివేకానంద ఫంక్షన్ హాల్‌లో జిల్లా స్థాయి పాటల, వ్యాసరచన చిత్రలేఖన పోటీలు నిర్వహిస్తామన్నారు. అదే రోజు విజేతలకు బహుమతి ప్రదానం జరుగుతుందన్నారు. ఎస్సై రాములమ్మ, విన్నకోట నీలేష్ గుప్తా, అల్లాడ శ్రీనివాసరావు, ఆర్ మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

టిడిపి కార్యాలయ నిర్మాణానికి భూమి పూజ

ప్రజాశక్తి - పరవాడ : మండల కేంద్రంలోని సింహాద్రి రెస్టారెంట్ పక్కన ఖాళీ స్థలంలో తెలుగుదేశం పార్టీ కార్యాలయం నిర్మాణానికి టిడిపి మండల అధ్యక్షులు వియ్యపు చిన్నా ఆధ్వర్యంలో సోమవారం శంకుస్థాపన చేశారు. మాజీ ఎంపీపీ మాసవరపు అప్పల నాయుడు పూజా కార్యక్రమం నిర్వహించారు. టిడిపి రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి అట్ట సన్యాసి అప్పారావు, ఒమ్మి ఎంపిటీసీ వెంకట్రావు, టిఎన్టియుసి అధ్యక్షులు రొంగలి గోపాల్ కృష్ణ, గొర్లి కనకారావు తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీ భవనాల నిర్మాణానికి భూమి పూజ

ప్రజాశక్తి- మునగపాక రూరల్ : గ్రామంలో నాడు-నేడు నిధులతో అంగన్వాడీ కేంద్రాల నిర్మాణానికి సోమవారం స్థానిక ఎంపీపీ మళ్ల జయలక్ష్మి, జడ్పిటిసి పెంటకోట స్వామి సత్యనారాయణ, సర్పంచి దిమ్మల అప్పారావు సోమవారం భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు. వైసిపి మండల కన్వీనర్ ఆడారి గణపతి అచ్చం నాయుడు, పిఎసిఎస్ పర్సన్ ఇన్‌ఛార్జి కొనపల్లి రామ్మోహన్‌రావు, ఎంపిటీసీ బోడకుర్తి గణేష్, శివ గణేష్, అంగనవాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.


భూమి పూజ చేస్తున్న ఎంపిపి జయలక్ష్మి తదితరులు

ప్రజా సమస్యలపై అధికార పార్టీ సభ్యుల నిలదీత

ప్రజాశక్తి-మాడుగుల:మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ పెదబాబు అధ్యక్షతన సోమవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో అధికార పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు సమస్యల పట్ల తీవ్ర అగ్రహం వ్యక్తం చేశారు. ప్రతిపక్ష పాత్ర పోషించారు. తొలుత సమావేశం ప్రారంభం కాగానే ఎం.కోడూరు సర్పంచ్ గొల్లవిల్లి సంజీవరావు మాట్లాడుతూ, ఇన్నాళ్ళూ జరిగిన సమావేశాలలో సమస్యలను ప్రజాప్రతినిధులు ప్రశ్నించడం జరిగిందని, దీనికి ఏ విధమైన చర్యలు చేపట్టారో అధికారులు చెప్పాలని పట్టుపట్టారు. అనేక శాఖలకు చెందిన అధికారులు సమావేశాలకు హాజరు కాకపోయినా మనం ఏమి చేశామని తీవ్ర ఆగ్రహంతో ప్రశ్నించారు. దీనిపై మండల పరిషత్ అధికారులు సమాధానం చెప్పలేకపోయారు అనంతరం వ్యవసాయ శాఖ కు సంబంధించి చర్చరాగానే అనేక మండలాలలో ధాన్యం కొనుగోలు ఇప్పటికే ప్రారంభం అయ్యిందని మాడుగుల మండలంలో ఇంతవరకు ధాన్యం కొనుగోలు ఎందుకు ప్రారంభించలేదని సంజీవరావు తీవ్రంగా ప్రశ్నించారు. గోనె సంచులు సిద్ధం అయ్యాయా అని ప్రశ్నించగా, అన్ని పిఏసిఎస్ కేంద్రాలకు పంపించామని మండలంలో 14 వేల గోనె సంచులు సరఫరా చేశామని మండల వ్యవసాయ శాఖ అధికారి వాసుదేవరావు సమాధానం ఇచ్చారు. దీనిపై ఎం.కోడూరు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘానికి ఇంతవరకు గోనె సంచులు పంపలేదని, ఇటువంటి తప్పుడు సమాచారం ఇవ్వడం సరికాదని సంజీవరావు తీవ్ర అక్రమ వ్యక్తం చేశారు. తేమ శాతం నిర్ధారణ యంత్రాలు సరిగ్గా పని చేయలేనప్పుడు ముందుగా వాటిని ఎందుకు సరి చేయలేదని ధాన్యం కొనుగోలుకు సంబంధించి రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా సంబంధిత శాఖ ఎటువంటి చర్యలు చేపట్టక పోవడం విచారకరమన్నారు. అనంతరం గృహ నిర్మాణ శాఖకు సంబంధించి చర్చ రావుగానే మండలంలో అనేక గ్రామాలలో ఇప్పటికే ఇళ్ల నిర్మాణాలు జరుగుతున్నా ఎం.కోడూరులో ఇప్పటివరకు ఎందుకు ప్రారంభించలేదని ఆయన ప్రశ్నించారు. కొందరు రైతులు అభ్యంతరం వ్యక్తం చేస్తుంటే వారిని ఎందుకు అరికట్ట లేకపోయారని వారిపై ఎందుకు కేసులు నమోదు చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇళ్ల నిర్మాణానికి పట్టాలు మంజూరు చేస్తూ నిధులు మంజూరు చేస్తున్నా అధికారులు ఎందుకు నిర్లక్ష్యం వ్యక్తం చేస్తున్నారని వాదించారు. వైద్యశాఖకు సంబంధించి ఎంఎల్‌హెచ్‌పీ సిబ్బంది గ్రామాలలో ఏ విధులు నిర్వహిస్తున్నారని ప్రశ్నించారు. ఎం.కోటపాడు సర్పంచ్ సేనాపతి శేషు ఫణి గంగాధర్ మాట్లాడుతూ,



మాట్లాడుతున్న ఎంపీపీ

ఈ సిబ్బంది మండలంలో అనేక గ్రామాలలో ఎటువంటి పనులు నిర్వహించలేదన్నారు. వైస్ ఎంపీపీ కొత్తపల్లి శ్రీనివాస్ ట్లాడుతూ, సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపించారు. గాదిరాయి సర్పంచ్ పెంటకోట జగన్నాథ రావు మాట్లాడుతూ ఈ సిబ్బంది విషయం ఇంతవరకు తనకే తెలియదని విమర్శలు చేశారు. సమావేశం ఏర్పాటు చేయాలని వైస్ ఎంపీపీ తాళపు రెడ్డి రాజారాం ఆదేశించారు. ఈ సమావేశంలో ఎంపీడీవో మీనా కుమారి, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

జగనన్న గృహాలను త్వరితంగా పూర్తి చేయాలి

ప్రజాశక్తి - చీడికాడ: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న నవరత్న పథకాలలో భాగంగా జగనన్న గృహాలను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీపీ కూరచా జయమ్మ, జెడ్పిటిసి లాలం శారదావరలక్ష్మి కోరారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం ఎంపీడీవో జయప్రకాశరావు ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రజా సమస్యలు తమ దృష్టికి తీసుకు వస్తే పరిష్కరిస్తామన్నారు. తహసిల్దార్ బీవీ రాణి మాట్లాడుతూ, ఈనెల 31 లోపు ఇల్ల నిర్మాణాలను లబ్ధిదారులు ప్రారంభించాలని, లేకుంటే పట్టాలను రద్దు చేస్తామన్నారు. ఇది వరకే ఇళ్ల నిర్మాణం ప్రారంభించని వారికి నోటీసులు పంపించామన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆ పట్టాలు అర్హత గల వేరొకరికి కేటాయించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు డి.ధర్మశెట్టి స్వాతి కొండబాబు, కిమిడి చిన్నమ్మలు, కో ఆప్షన్ సభ్యులు సూర్యనారాయణ, పిఏసిఎస్ అధ్యక్షులు సన్ని బాబు, రమణబాబు, సర్పంచ్ లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు

పాడి రైతుల సంక్షేమమే ధ్యేయం

ప్రజాశక్తి - చీడికాడ:పాడి రైతుల సంక్షేమానికి విశాఖ డెయిరీ కృషి చేస్తుందని చీడికాడ పాల కేంద్రం అధ్యక్షుడు పరవాడ అప్పారావు అన్నారు. చీడికాడ పాల కేంద్రానికి ప్రహరీ, మరుగుదొడ్ల నిర్మాణానికి గాను ఐదు లక్షల 80 వేలు విశాఖ డెయిరీ నిధులు మంజూరు చేయగా సోమవారం పాల సొసైటీ డైరెక్టర్లతో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా అప్పారావు, పాడి రైతుల కుటుంబాలకు విద్య, వైద్యంతో తో పాటు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తుందన్నారు. చీడికాడ గ్రామంలో గండి వారి కల్లాలు సమీపంలో ఉన్న శ్మశాన వాటిక నిర్మాణానికి రెండు లక్షల 50 వేల నిధులు మంజూరు అయ్యాయని, త్వరలో శంకుస్థాపన చేస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో చీడికాడ పాల సొసైటీ డైరెక్టర్లు పరవాడ రామారావు, రెడ్డి సత్యనారాయణ, మేడపు రెడ్డి గౌరీ నాయుడు, బాదిరెడ్డి నారాయణమూర్తి, పాల సొసైటీ కార్యదర్శి బండారు నాయుడుబాబు, సిబ్బంది జంజాల భాస్కర్ రావు, శ్రీరామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.



శంకుస్థాపన చేస్తున్న అప్పారావు

గ్రంథాలయాలతో విజ్ఞానం

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్: సెల్ఫోన్ బారిన పడకుండా పిల్లలకు గ్రంథాలయాలు అలవాటు చేస్తే విజ్ఞానం న వం క వా ర ం త ం ద ని లైబ్రేరియన్ పి.దమయంతి పేర్కొ న్నారు. సోమ వారం ఆమె శాఖా గ్రంధాల యంలో విలేక రులతో మాట్లాడుతూ,ప్రతి ఆదివారం పిల్లల వికాసానికి వివిధ పోటీలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గొలుగొండ గ్రంథాలయ అధికారి రాజబాబు పాల్గొన్నారు.



గ్రంథాలయ అధికారి

మాజీ ఎమ్మెల్యే అనిత పరామర్శ

ప్రజాశక్తి-నక్కపల్లి:మండలంలోని ఉపమాక పంచాయతీ మామిడివానిపాలెం గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, ఎంపిటీసీ మాజీ సభ్యులు మామిడి అప్పారావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. తెలుగుదేశం పార్టీ పోలిట్ బ్యూరో సభ్యురాలు, మాజీ ఎమ్మెల్యే వంగలపూడి అనిత సోమవారం స్థానిక పార్టీ నాయకులతో కలిసి అప్పారావు కుటుంబ సభ్యులను పరామర్శించి, సానుభూతిని వ్యక్తం చేశారు. పరామర్శించిన వారిలో పార్టీ మండల శాఖ అధ్యక్షులు కొప్పిశెట్టి వెంకటేష్ , పార్టీ సీనియర్ నాయకులు కురందాసు నూకరాజు, నాయకులు కొప్పిశెట్టి బుజ్జి, ప్రగడ వీరబాబు, తోలేటి శ్రీనివాస్, తాతారావు తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలకు శ్రీకారం

ప్రజాశక్తి-నక్కపల్లి:మండలంలోని గొడిచర్లలో జగనన్న లేఅవుట్‌లో గృహ నిర్మాణాలకు శ్రీకారం చుట్టారు. సోమవారం ఎంపీడీవో సీతారామరాజు, ఈ ఓపిఆర్‌డి వెంకటనారాయణ, పంచాయతీ సర్పంచ్ అల్లు పార్వతి ఆధ్వర్యంలో లబ్ధిదారులతో సమావేశం ఏర్పాటు చేసి గృహ నిర్మాణాలపై అవగాహన కల్పించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు లబ్ధిదారులు గృహ నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలన్నారు. లబ్ధిదారులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూసుకుంటామని, పేమెంట్లకు ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. లబ్ధిదారులతో కలిసి గృహ నిర్మాణాల పనులను ప్రారంభించారు.అనంతరం చెత్త నుండి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు అల్లు రమణ, పంచాయతీ కార్యదర్శి సాయి లక్ష్మి, హౌసింగ్ అధికారులు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.



పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్, ఎంపీడీవో

22న వాహనాల వేలం

ప్రజాశక్తి-గొలుగొండ: గొలుగొండ స్పెషల్ ఎన్‌ఫోర్స్ మెంట్ బ్యూరో స్టేషన్ పరిధిలో ప్రొహిబిషన్, ఎక్సైజ్ నేరాలలో పట్టుబడ్డ ఏడు వాహనాలకు ఈ నెల 22న ఉదయం 10 గంటలకు నర్సీపట్నం స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్ వద్ద బహిరంగ వేలం నిర్వహిస్తామని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సిఐ రాజారావు తెలిపారు. అనకాపల్లి అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరిండెంటెంట్ రవికుమార్‌ల పర్యవేక్షణలో బహిరంగ వేలం వేయడం జరుగు తుందన్నారు. ఆసక్తి ఉన్న పాటదారులు ముందుగా రూ.3వేలు అడ్వాన్స్ చెల్లించాలన్నారు.

ఏరియా ఆసుపత్రిలో సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి -నర్సీపట్నంటౌన్: స్థానిక ఏరియా ఆసుపత్రిలో సమస్యలను పరిష్కరించాలని మున్సిపల్ కౌన్సిలర్ చింతకాయల పద్మావతి డిమాండ్ చేశారు. ఏరియా ఆసుపత్రి వ్యర్ధాలతో చుట్టుపక్కల ప్రజలు రోగాల బారిన పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. స్థానికులు ఆసుపత్రి నుంచి వస్తున్న వ్యర్ధాలు, ఇబ్బందులను పద్మావతి దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఏరియా ఆసుపత్రిలోని సెప్టిక్ ట్యాంక్, పోస్టుమార్టమ్ నుంచి వ్యర్ధాలు 27వ వార్డులోని వీధుల్లోకి వస్తున్నాయన్నారు. దీనిపై ఇప్పటికే ఆసుపత్రి సూపరిండెంట్‌కు నాలుగుసార్లు ఫిర్యాదు చేసిన పట్టించుకోలేదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. డ్రైనేజి నిర్మాణానికి సంబంధించి మున్సిపాలిటీలో రూ.20 లక్షలు మంజూరు చేస్తున్నట్టు హామీ ఇచ్చినా ఇంతవరకు నిధులు మంజూరు చేయలేదన్నారు. ఈ సమస్యతో వార్డులోని ప్రజలంతా నిత్యం రోగాల బారిన పడుతున్నారన్నారు. సెప్టిక్ ట్యాంకులను సకాలంలో క్లీనింగ్ చేయించాలన్నారు.

20, 21 తేదీల్లో పలు కార్యక్రమాలు

ప్రజాశక్తి-రోలుగుంట:ఈ నెల 21న ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదినోత్సవాన్ని పురస్కరిం చుకొని ఈ నెల 19న క్రీడా పోటీలు, 20న మొక్కలు నాటే కార్యక్రమం, 21న రక్తదాన శిబిరం, పేదలకు దుప్పట్ల పంపిణీ కార్యక్రమం చేపడుతున్నామని ఎంపిపి యర్రంశెట్టి శ్రీనివాస్ పేర్కొన్నారు. దీనిలో భాగంగా సోమవారం రోలుగుంట జడ్పీ హైస్కూల్ గ్రౌండ్స్‌లో చోడవరం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ ఆదేశాల మేరకు క్రీడా పోటీలు ప్రారంభించడం జరిగింది. విజేతలకు 21న బహుమతులు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పిటిసి రమణమ్మ, పార్టీ అధ్యక్షులు మడ్డు అప్పలనాయుడు, వెంకటరమణ, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

పొన్నవోలులో డ్రోన్ సర్వే

ప్రజాశక్తి -రావికమతం:మండలంలోని పొన్నవోలు గ్రామంలో డ్రోన్ సర్వేను గ్రామ సర్పంచ్ వి. రాజారావు సోమ వారం ప్రారంభిం చారు. ఈ స ం ద ర్భ ం గా సర్పంచ్ మాట్లా డుతూ, భూ సర్వేతో పలు సమస్యల పైన ఇబ్బందులు పడు తున్న రైతాంగానికి ఇది ఎంతగానో ఉపయోగ పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఉమామహేశ్వరరావు, ఆర్ఐ సతీష్ పాల్గొన్నారు.



సర్వే ప్రారంభిస్తున్న సర్పంచ్

జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు ప్రారంభం



క్రీడాకారులను పరిచయం చేసుకున్న ఎమ్మెల్యే బాబూరావు

ప్రజాశక్తి -నక్కపల్లి:ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి జన్మదినం పురస్కరించుకుని పాయకరావుపేట నియోజకవర్గంలో పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే గొల్ల బాబురావు తెలిపారు. నక్కపల్లిలో వైసిపి నాయకులు శీరం నరసింహమూర్తి కొబ్బరి తోటలో సోమవారం నిర్వహించిన జిల్లాస్థాయి కబడ్డీ పోటీలను ఆయన ప్రారంభించారు. క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, సీఎం జగన్ జన్మదిన వేడుకల సందర్భంగా జిల్లాస్థాయి కబడ్డీ పోటీలతో పాటు , ఇతర క్రీడా పోటీలు, మహిళలకు ముగ్గులు పోటీలు, మొక్కలు నాటడం వంటి పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పాయకరావుపేటలో ఈనెల 21న రక్తదాన శిబిరం ఏర్పాటు చేస్తున్నామని, అదే రోజు జగన్ జన్మదినం సందర్భంగా కేక్ కటింగ్, విజేతలకు బహుమ తులు ప్రధానం చేయనున్నట్లు చెప్పారు. పిడి కుందూరు రాజు ఆధ్వర్యంలో క్రీడాకారులు కబడ్డీ పోటీల్లో ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. స్థానిక గురుకులంలో ఎమ్మెల్యే మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు శీరం నరసింహమూర్తి, చిక్కాల రామారావు, సూరకాసుల గోవింద్, లోడగల చంద్రరావు, జనపరెడ్డి శేషారత్నం, గొర్ల బాబురావు, గొర్ల నరసింహమూర్తి, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

హాకీ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి -నక్కపల్లి:నక్కపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో నియోజవర్గ స్థాయి హాకీ పోటీలను బలిరెడ్డి సత్యవతి హాకీ క్లబ్ కార్యదర్శి కొల్నాటి తాతాజీ ఆధ్వర్యంలో వైసిపి మండల శాఖ అధ్యక్షులు పొడగట్ల పాపారావు, స్కూల్ కమిటీ చైర్మన్ కర్రి పద్మ హాకీ పోటీలను ప్రారంభించారు. సీఎం జగన్మోహన్ రెడ్డి జన్మదినంను పురస్కరించుకొని ఈ పోటీలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ ఉపాధ్యక్షులు వీసం నానాజీ, ఈశ్వరరావు పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతుల ప్రదానం

ప్రజాశక్తి-మాడుగుల: ప్రభుత్వ ఆధ్వర్యంలో అమలు అవుతున్న అమ్మఒడి, జగనన్న విద్యా దీవెన కార్యక్రమాల పట్ల విద్యార్థులకు నిర్వహించిన వ్యాస రచన పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో బహుమతులు అందించారు. మండల స్థాయిలో ఆదివారం ఈ పోటీలు నిర్వహించగా మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు, ధ్రువపత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పెదబాబు, వైస్ ఎంపీపీలు తాలపురెడ్డి రాజారాం, కొత్తపల్లి శ్రీనివాసరావు, సర్పంచ్ కళావతి, వైసిపి పట్టణ శాఖ అధ్యక్షులు బొమ్మిశెట్టి శ్రీనివాసరావు, ఎంఈఓ దేముడమ్మ పాల్గొన్నారు.

చీడికాడ:నవరత్నాల పథకాలు, విద్యా రంగంలో ప్రాముఖ్యత అనే అంశంపై మండల స్థాయిలో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ వ్యాసరచన పోటీలలో గెలుపొందిన విజేతలకు తహశీల్దార్ బివి రాణి, ఎంపిడివొ జయప్రకాశ్, ఎంపిపి కురచా జయమ్మ నారాయణమూర్తి, జడ్పీటీసీ లాలం శారద వరలక్ష్మి జానకిరామ్, వైస్ ఎంపిపి స్వాతి కొండబాబుల చేతుల మీదుగా నాయకులు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కోడూరు పరదేశి , గొర్లి ప్రసాదు పాల్గొన్నారు.

రైతుకు అమృత ఫల సేవలు



గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ చేతుల మీదుగా డాక్టర్ వైఎస్ఆర్ అచీవ్‌మెంట్ అవార్డు అందుకుంటున్న లక్ష్మీ నీరజ మౌక్తిక, చిత్రంలో సిఎం జగన్మోహన్ రెడ్డి

- ఐటి విద్యార్థికి అరుదైన గౌరవం
- వ్యవసాయ రంగంలో వైఎస్ఆర్ అచీవ్‌మెంట్ అవార్డు పొందిన మౌక్తిక
- పలువురి ప్రశంసలు

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

ఇష్టమైన పనిని మనసు పెట్టి చేస్తే... గుర్తింపు వెతుక్కొని మరీ వస్తుంది. విజయాలూ వెన్నంటి వస్తాయి. ప్రశంసలు కోసం ఆశించకపోయినా, అవి కూడా దానంతటవి వెన్నుతడతాయి. అలా లభించిందే.. అనకాపల్లి జిల్లా సబ్బవరం మండల కేంద్రంలోని అమృత ఫల రైతు ఉత్పత్తిదారుల సంస్థ సిఇఒ కందప్ప లక్ష్మీ నీరజ మౌక్తికకు వ్యవసాయరంగంలో వైఎస్ఆర్ అచీవ్‌మెంట్ - 2022 పురస్కారం. లక్షల రూపాయల జీతం కోసం పరుగులు పెడుతున్న ఈ రోజుల్లో వాటిని వదులుకొని బిటెక్‌లో ఐటి చేసి వ్యవసాయంపై మక్కువ పెంచుకున్నారు మౌక్తిక.

చదువు పూర్తిచేసి ఏ స్ఫూర్తితో అమృతఫల రైతు ఉత్పత్తిదారుల సంస్థ సిఇఒగా బాధ్యతలు చేపట్టారో... ఆ నాటి నుంచి అదే పట్టుదలతో సంస్థల సేవలు విస్తరణకు విశేష కృషి చేస్తున్నారు. సేంద్రియ సాగు, ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ, పంటకు గిట్టుబాటు ధర కల్పన వంటి ప్రధాన లక్ష్యంతో 2017లో కందర్ప రామకృష్ణ స్థాపించిన జాగృతి సంస్థ ప్రమోట్ చేసిన రైతు ఉత్పత్తిదారుల సంస్థ ఇది. సబ్బవరం మండలంలోని 23 పంచాయతీల్లో 1020 మంది రైతు సభ్యులున్నారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో కూరగాయలు, ఆకుకూరలు, బొప్పాయి, జామ వంటి పంటలను ప్రోత్సహించి గిట్టుబాటు ధరను సంస్థ అందిస్తోంది. పంటల పొలాల దగ్గరకు వెళ్లి తూకంవేసి మార్కెటింగ్ శాఖ నిర్దేశించిన ధరల ప్రకారం పొలాల్లోనే నగదు చెల్లించడం సంస్థ ప్రత్యేకత. దీంతో రైతుకు తమ ఉత్పత్తుల అమ్మకానికి రవాణా ఖర్చులు పెట్టుకొని ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా పోయింది. రైతుల నుంచి కొనుగోలు చేసిన నాణ్యమైన పంటలను ఆస్పత్రులు, హాస్టళ్లు, కాలేజీ హాస్టళ్లకు సరఫరా చేస్తున్నారు. ఈ సంస్థ నాబార్డు చేయూత, ఉద్యానవనశాఖ, వ్యవసాయశాఖ స్కీంలను ఉపయోగించుకుంటూ రైతుకు లాభం చేకూర్చుతోంది.

'వైఎస్ఆర్ అచీవ్‌మెంట్ అవార్డు వస్తుందని తెలీదు. ఈ తరహా అవార్డులున్నాయన్న అవగాహన లేదు. అవార్డు రావాలని పనిచేయలేదు. ఉద్యానవనశాఖాధికారులు రైతు ఉత్పత్తిదారుల సంస్థ వివరాలు అడిగితే ఇచ్చాం. అవార్డు ప్రకటించే వరకు ఎంపికైనట్లు తెలీదు. విజన్‌తో ముందుకువెళ్లాం. దానికి గుర్తింపే ఈ అవార్డు అని బావిస్తున్నాను. ఇది మరింత బాధ్యతను పెంచింది. కృషికి ప్రోత్సాహమిది' అంటున్నారు మౌక్తిక. రైతులు సభ్యతాన్ని పెంచుకుంటూ ఎక్కువ మందికి సేవలు అందించే సంకల్పంతో సంస్థ అడుగులు వేస్తోంది.

జాగృతి సొసైటీ ఆధ్వర్యంలో మొదట ఏర్పాటు చేసిన అమృతఫల రైతు ఉత్పత్తిదారుల సంస్థ అనుభవాలను దృష్టిలో పెట్టుకొని వనఫల రైతు ఉత్పత్తిదారుల సంఘం (హుకుంపేట), సంకల్పఫల రైతు ఉత్పత్తిదారుల సంఘం (పరవాడ), ప్రకృతి ఫల రైతు ఉత్పత్తిదారుల సంఘం (పెందుర్తి), సుఫల జాగృతి రైతు ఉత్పత్తిదారుల సంఘం (అడ్డూరు), కృషి ఫల రైతు ఉత్పత్తిదారుల సంఘం (కె.కోటపాడు), సిద్ధిఫల రైతు ఉత్పిత్తిదారుల సంఘం (చోడవరం) విస్తరించింది. సభ్య రైతుల పంటలను నిల్వచేసుకొనేందుకు కోల్డ్ స్టోరేజ్ సౌకర్యం కూడా అమృతఫల కార్యాలయ ప్రాంగణలో నెలకొల్పారు.

ప్రజలకు సేవచేయాలన్న ఆలోచన మౌక్తికకు కాలేజీ దశలో ఏర్పడింది. విద్యార్థులతో కలిసి మిగిలిన ఎన్‌జిఒలతో సర్వీసు అందించారు. బిటెక్ అయ్యాక ఎంబిఎ చేయాలనుకున్న ఈమె రైతుకు ఉపయోగపడాలని ఈ పనిని ఎంచుకున్నాను. 'ప్రాక్టికల్ ఎంబిఎగా ఈ పనిని భావిస్తున్నాను' అని అంటున్నారు మౌక్తిక. వైఎస్ఆర్ అచీవ్‌మెంట్ అవార్డు కాంపిటేటివ్ స్పిరిట్ పెంచింది. ఈ అవార్డును సంస్థ వ్యవస్థాపకులు రామకృష్ణకు అంకితం చేశాం. ప్రారంభంలో చేసిన కృషి, లక్ష్య సాధనకు ఏర్పాటు చేసుకున్న విజన్ చాలా బలమైనదికావడంతోనే మంచి ఫలితాలు సాధిస్తున్నామని చెబుతున్నారామె.



అమృత ఫల సూపర్ మార్కెట్‌లో మౌక్తిక

జాతీయస్థాయి స్కేటింగ్ పోటీల్లో ప్రతిభ

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్:బెంగళూరులో శనివారం జరిగిన 60వ జాతీయస్థాయి స్కేటింగ్ పోటీలలో పెయిర్ స్కేటింగ్ విభాగంలో నర్సీపట్నంకు చెందిన పెదిరెడ్ల సతీష్ కుమార్తె చైత్ర దీపిక బంగారు పతకం సాధించింది. ప్రస్తుతం ఈ విద్యార్థి సెయింట్ మాథ్యూస్ స్కూల్ (విజయవాడ)లో 7వ తరగతి చదువుతుంది. ఐదు సంవత్సరాల వయసు నుంచే స్కేటింగ్ పట్ల ఈ అమ్మాయికి ఉన్న ఆసక్తిని గమనించిన తల్లిదండ్రులు సతీష్, లలిత నర్సీపట్నంలో రామారావుపేటకు చెందిన పంచాడ సత్యనారాయణ వద్ద స్కేటింగ్‌లో మొదట్లో శిక్షణ ఇచ్చారు. గతంలోనూ జిల్లా, జాతీయస్థాయి పోటీలలో పతకాలు సాదించింది. చైత్రదీపికకు పలువురు అభినందనలు తెలిపారు.



సత్తా చాటిన చైత్ర దీపిక

గ్రామాల్లో మొక్కలు నాటివేత

ప్రజాశక్తి -పాయకరావుపేట:ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పుట్టినరోజు వేడుకల్లో భాగంగా సోమవారం స్థానిక విశ్రాంతి భవనం వద్ద రాజుగారి బీడీ సిమెంట్ రోడ్డు ఇరువైపులా స్థానిక ఎమ్మెల్యే గొల్ల బాబురావు మొక్కలు నాటారు. ముందుగా విగ్నేశ్వర స్వామి ఆలయంలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పేరుతో పూజలు నిర్వహించారు. సిమెంట్ కాలువ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ మండల అభివృద్ధి చైర్మన్ చిక్కాల రామారావు, మండల పార్టీ అధ్యక్షుడు దనిశెట్టి బాబురావు, పాయకరావుపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గూటూరు శ్రీనివాసరావు, ఇసారపు తాతారావు, దగ్గుపల్లి సాయి బాబా, జగతా శ్రీను, సర్పంచులు నాయకులు, కార్యకర్తలు మండలాధికారులు తదితరులు పాల్గొన్నారు



మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే

గొలుగొండ:మొక్కలు నాటి వాటిని సంరక్షించుకోవాలని జెడ్పీటీసీ సుర్ల వెంకట గిరిబాబు సూచించారు. సోమవారం సోషల్ ఫారెస్ట్ ఎఫ్ఎస్ఓ భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో మండలంలోని ఎన్.కంఠారం పంచాయతీ ఆర్అండ్‌బి రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ విడుదల రాజేశ్వరి, ఎంపిటిసి లక్ష్మీ దుర్గ, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

మహిళలు అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-కొత్తకోట:లైంగిక వేధింపులు పట్ల మైనర్ బాలికలు, మహిళలు అప్ర మత్తం గా మెల గాలని కోరు తూ జిల్లా పోలీసులు సోమవారం ప్రచారం చేపట్టారు. అనకాపల్లి జిల్లా ఎస్పీ గౌతమి శాలి ఆదేశాల మేరకు కొత్తకోట ఎస్సై విభూషణరావు ఆధ్వర్యంలో టి.అర్జా పురం, కొత్తకోట, దొండపూడి, జెడ్.కొత్తపట్నం తదితర గ్రామాలలో ప్రభుత్వ పాఠశాలలో ఈ ప్రచార కార్య క్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రచార రథంలో లైంగిక దాడులు నివారణ, అవగాహనపై ఎస్సై వివరించారు. ఆయా పాఠశాలల హెచ్ఎం నాయుడు, సత్యారావు, నాగేశ్వరరావు, సిఆర్‌పి రామారావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్ఐ

సమస్యలపై ఎమ్మెల్యేకు వినతి

ప్రజాశక్తి- నర్సీపట్నంటౌన్: కాంట్రాక్ట్ అధ్యాపకుల సమస్యల పరిష్కరించి, 12 నెలల వేతనం చెల్లించాలని ప్రభుత్వ, కాంట్రాక్ట్ లెక్చరర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు బిఎస్ఆర్ శర్మ ఆధ్వర్యంలో స్థానిక ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్‌గణేష్‌కు క్యాంపు కార్యాలయంలో సోమవారం వినతి పత్రాన్ని అందించారు. ప్రభుత్వం మేనిఫెస్టోలో పెట్టిన విధంగా రెగ్యులరైజేషన్ చేయాలని కోరారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల బాలికల కాంట్రాక్ట్ అధ్యాపకులు పాల్గొన్నారు.



వినతిపత్రం ఇస్తున్న అధ్యాపకులు

నయా సరళీకరణ విధానాలను వ్యతిరేకించాలి

మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్ శర్మ

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ రంగం మీద దాడి పెరిగిందని, ఉద్యోగ, కార్మిక, పెన్షనర్లు, విద్యార్థులు తదితరులపై జరుగుతున్న దాడుల మధ్య నున్న ప్రధాన లింకు నయా సరళీకరణ విధానాలు అని మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్ శర్మ అన్నారు. వీటన్నింటికీ వ్యతిరేకంగా జరుగుతున్న సమైక్య పోరాటంలో ఎల్ఐసి ఉద్యోగులు కూడా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఐసిఆర్ఇఎ, ఐసిఇయు ఆధ్వర్యాన ఎల్ఐసి పెన్షనర్లు, ఉద్యోగులు 'ఆలిండియా పెన్షనర్స్ దినం' సందర్భంగా ఎల్ఐసి డివిజనల్ ఆఫీసు వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 30 శాతం కుటుంబ పెన్షన్ ఇవ్వాలని మూడేళ్ల క్రితం ఎల్ఐసి యాజమాన్యం పంపించిన సిఫార్సులను కేంద్ర ప్రభుత్వం ఇప్పటి వరకూ మంజూరు చెయ్యక పోవడం పట్ల పెన్షనర్లు, ఉద్యోగులు తీవ్ర అసంతృప్తి ఉందన్నారు. 30 శాతం కుటుంబం పెన్షన్ ఇవ్వాలని, చివరి నెల జీతం ఆధారంగా పెన్షన్ నిర్ణయించాలని, రోజు వారీ వైద్య అవసరాల కోసం క్యాష్ మెడికల్ బెనిఫిట్ ఇవ్వాలని, అందరికీ పాత డిఫైన్డ్ బెనిఫిట్ పెన్షన్ పథకం అమలు చెయ్యాలని, ఎల్ఐసిని ప్రభుత్వ రంగంలో కొనసాగించాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు. ఎఐఐపిఎ జాతీయ ఉపాధ్యక్షుడు కె.మోహన్‌రావు మాట్లాడుతూ, 30 శాతం కుటుంబ పెన్షన్‌ను సాధించుకోవడానికి ఐక్యంగా పోరాడాలన్నారు. ఎన్‌పిఎస్ రద్దు కోసం ఇతరులతో కలిసి పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఐఈఆర్ఇఎ ప్రధాన కార్యదర్శి ఆర్.పాండురంగన్, జి.వరప్రసాద్, ఎం.కామేశ్వరి, ఎన్.కృష్ణమూర్తి, ఎం.వెంకటేశ్వర్లు మాట్లాడారు. ఎల్ఐసి సీనియర్ డివిజనల్ మేనేజర్ ద్వారా ఎల్ఐసి చైర్మన్‌ఈ మేరకు ఒక వినతి పత్రాన్ని పంపించారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్ శర్మ

23న ధర్నాను జయప్రదం చేయాలి

మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు

ప్రజాశక్తి-నర్సీపట్నంరూరల్ : రైతులకు జరుగుతున్న అన్యాయంపై ఈ నెల 23న నర్సీపట్నం సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగే ధర్నాను పార్టీలకతీతంగా అందరూ పాల్గొనాలని మాజీ మంత్రి, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు చింతకాయల అయ్యన్నపాత్రుడు విజ్ఞప్తి చేశారు. సోమవారం నర్సీపట్నంలో అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అయ్య న్నపాత్రుడు మాట్లాడుతూ, 23న ప్రపంచ రైతు దినోత్సవం సందర్భంగా ఈ ధర్నా చేస్తే బాగుంటుందని అఖిలపక్ష సమావేశంలో నిర్ణయం తీసుకోవడం జరిగిందన్నారు. 23న సిబిఎం కాంపౌండ్ నుంచి సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి అక్కడ ధర్నా చేస్తామని తెలిపారు. తుపాన్ కారణంగా రాష్ట్ర వ్యాప్తంగా ఆరు లక్షల ఎకరాల్లో పంట దెబ్బతిని, రైతులు తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. ఈ సమావేశంలో జనసేన నియోజకవర్గ ఇన్చార్జ్ సూర్యచంద్ర, జనసేన టౌన్ అధ్యక్షులు అద్దేపల్లి గణేష్, సిపిఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ, సిపిఐ నాయకులు గురుబాబు, బిజెపి కన్వీనర్ కాళ్ల సుబ్బారావు, టీడీపీ నేతలు రుత్తల యర్రాపాత్రుడు, అడిగర్ల అప్పలనాయుడు, లాలం శ్రీరంగస్వామి, నందిపల్లి వెంకటరమణ, నర్సీపట్నం జెడ్పీటీసీ సుకల రమణమ్మ నాతవరం మాజీ జెడ్పీటీసీ కరక సత్యనారాయణ, నర్సీపట్నం టౌన్ టీడీపీ ప్రధాన కార్యదర్శి గవిరెడ్డి వెంకటరమణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు

టిడిపితోనే సమగ్ర అభివృద్ధి

మాకవరపాలెం: టిడిపితోనే సమగ్ర అభివృద్ధి సాధ్యమని మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు తెలిపారు. సోమవారం మండలంలో జంగాలపల్లి పంచాయతీలో ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో పార్టీ నాయకులతో కలిసి ఇంటింటికి తిరుగుతూ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు ఆర్‌వై పాత్రుడు, సర్పంచ్ అల్లు రామనాయుడు పాల్గొన్నారు.